




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 306 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి శుక్రవారం 11 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## చేనేత రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయండి

### అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

- రుణమాఫీ కోసం రూ. 33 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా 5,691 మంది కార్మికులకు లబ్ధి
- ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లను వేగవంతం చేయాలని తుమ్మల సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నిధులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని, వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈరోజు హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల పురోగతిని

వివరాలు 2లో..



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

### రెండు విద్యాసంస్థలకు వర్శిటీ హోదా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు



- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు తెలంగాణ కేబినెట్ ఆమోదం
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన
- రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలని ప్రభుత్వం స్పష్టీకరణ
- అమిటీ, సెంటినరీ సంస్థలకు యూనివర్సిటీ హోదా మంజూరు
- 17 వేలకు పైగా ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ సిద్ధం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణన ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్‌లకు ప్రైవేట్ యూనివర్సిటీ హోదా కల్పిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందని పొంగులేటి వివరించారు. ఈ వర్సిటీలలో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని అన్నారు. 17 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందని, మార్చి నాటికి లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ఇప్పటివరకు 19 కేబినెట్ సమావేశాలు నిర్వహించి, 321 అంశాలకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.

## తెలంగాణ ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలి

- లోకేశ్‌కు ఉమ్మడి ఏపీతో కూడిన పటాన్ని బహూకరించిన ఏపీ బీజేపీ చీఫ్.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్
- లోకేశ్ కు 'అఖండ ఏపీ' పటం బహుమతిగా ఇవ్వడంపై వివాదం
- బీజేపీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ అస్తిత్వాన్ని, పోరాటాన్ని కించపరిచారని ఆరోపణ
- ఇది బీజేపీ రాజకీయ అజెండానా అనేది స్పష్టం చేయాలని ప్రధానికి ప్రశ్న

వివరాలు 2లో..



## వైద్యుల సూచన మేరకు యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్

- హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్
- వైద్యుల సూచన మేరకే ఆసుపత్రిలో అడ్మిట్
- కొనసాగుతున్న తదుపరి వైద్య పరీక్షలు
- ఇటీవలే చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మాజీ ముఖ్యమంత్రి
- వారం రోజుల విశ్రాంతి అనంతరం మళ్లీ చేరిక



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు .ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కేసీఆర్, చికిత్స అనంతరం

వివరాలు 2లో..

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రండి.. తేల్చుకుందాం

### రేవంత్ రెడ్డికి కవిత సవాల్



- మహిళలకు ఇచ్చిన హామీలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చిద్దామన్న కవిత
- ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని తీవ్ర విమర్శ
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
- డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న రైల్ రోకోకు పిలుపు
- భద్రాచలం ఐదు గ్రామాల సమస్యపై మంత్రి తుమ్మల చొరవ చూపాలని సూచన

వివరాలు 2లో..

## వాళ్లను భర్తీ చేయడం ఏఐ వల్ల కూడా కాదు

- ఏఐతో ఉద్యోగాలపై ఆందోళనల నేపథ్యంలో బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు
- వచ్చే 100 ఏళ్ల వరకు ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు
- ఏఐ కేవలం అసిస్టెంట్ మాత్రమే, పూర్తి ప్రత్యామ్నాయం కాదు
- కోడింగ్‌కు సృజనాత్మకత, మానవ మేధస్సు అత్యంత కీలకం
- ఏఐతో ముప్పుపై తనకూ ఆందోళన ఉందని అంగీకరించిన గేట్స్
- ఏఐని సరిగ్గా వాడితే ఉత్పాదకత, ఖాళీ సమయం పెరుగుతాయి



**హైదరాబాద్ పెన్ పవర్:**కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఉద్యోగ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రోగ్రామింగ్ ఉద్యోగాలకు వచ్చే వందేళ్ల వరకు ఏఐ నుంచి ఎలాంటి ముప్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## దలైలామా వారసుడు చైనా నుంచి మాత్రం రాడు

- తదుపరి దలైలామా ఎంపికపై అరుణాచల్ సీఎం పెమా ఖండూ కీలక వ్యాఖ్యలు
- స్వేచ్ఛా ప్రపంచం నుంచే కొత్త ఆధ్యాత్మిక గురువు వస్తారని వెల్లడి
- దలైలామా ఎంపిక ప్రక్రియలో చైనాకు ఎలాంటి పాత్ర ఉండదని స్పష్టీకరణ
- ప్రజాస్వామ్య విలువలు లేని చైనాకు ఈ విషయంలో హక్కు లేదన్న ఖండూ
- ప్రస్తుత దలైలామా 130 ఏళ్లు జీవించాలని ఆకాంక్ష
- 600 ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారమే ఎంపిక జరుగుతుందని వెల్లడి



వివరాలు 2లో..

## మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారు: బీఆర్ఎస్‌పై ఎంపీ చామల ఆగ్రహం

- కేటీఆర్, హరీశ్ రావు మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారని ఆరోపణ
- కేటీఆర్ కేవలం ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రేవంత్ స్థాయి కాదని వ్యాఖ్య
- చర్చకు కేసీఆర్‌ను తీసుకురావాలని కేటీఆర్‌కు సవాల్
- రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో కేసీఆర్ ముంచారని విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..

## వరంగల్ కాంగ్రెస్ పంచాయితీ మళ్లీ గాంధీ భవన్‌కు..

- కొండా మురళిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవితో నేతల భేటీ
- కొండా మురళి వ్యవహారంపై ఫిర్యాదు
- కమిటీ ముందు వాదనలు వినిపించిన వ్యతిరేక వర్గం
- హాజరైన ఎమ్మెల్యేలు కడియం, నాయిని రాజేందర్‌రెడ్డి
- నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చిన కొండా మురళి

**హైదరాబాద్ పెన్ పవర్:**వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. సీనియర్ నేత కొండా మురళికి వ్యతిరేకంగా పలువురు కీలక నేతలు పార్టీ క్రమశిక్షణ కమిటీని ఆశ్రయించడంతో ఈ వివాదం మళ్లీ గాంధీ భవన్‌కు చేరింది. గురువారం నాడు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవితో వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

వివరాలు 2లో..



## షేక్ హసీనాను అప్పగించండి

### భారత్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి విజ్ఞప్తి



- భారత్ తన మనస్సాక్షితో వ్యవహరించాలన్న మహ్మద్ యూనస్ ప్రభుత్వం
- హసీనాపై హత్య, మానవత్వ వ్యతిరేక నేరాల కింద తీవ్ర ఆరోపణలు
- ఇప్పటికే కోర్టు ధిక్కరణ కేసులో ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష
- గతేడాది ఆగస్టు నుంచి భారత్‌లోనే తలదాచుకుంటున్న షేక్ హసీనా
- బాధితులకు న్యాయం జరగాలంటే హసీనాను అప్పగించాలని స్పష్టీకరణ

వివరాలు 2లో..

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను వెంటనే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో భారత్ తన మనస్సాక్షితో వ్యవహరించి సముచిత నిర్ణయం తీసుకోవాలని సూచించింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ కార్యాలయం ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. "షేక్ హసీనాను అప్పగించాలని మేం పదేపదే అభ్యర్థిస్తున్నప్పటికీ, భారత్ నుంచి స్పందన కరవైంది. ఈ అంశాన్ని మరింత జాప్యం చేయడం

## ఎడిటర్ వ్యూ

# 2029 లో పీఎం అతనే !

ఇది జోస్యం కాదు, సర్వే అంతకంటే కాదు, అధ్యయనం కూడా కాదు, రాజకీయ విశ్లేషణ గా చెప్పొచ్చు. జరుగుతున్న పరిణామాలను నిజంగా విశ్లేషించుకుంటే కనుక అతనే సువిశాల భారత దేశానికి కాబోయే ప్రధాన మంత్రి అన్నది ఒక విశ్లేషణగా ఉంది ఆయన ఎవరో కాదు కేంద్రంలో గత పదకొండేళ్లుగా నిరాటంకంగా సాగుతున్న ఎన్డీయే ప్రభుత్వంలో నంబర్ టూ. బీజేపీలో అగ్ర నేత. అటు పార్టీ ఇటు ప్రభుత్వంలో తనదైన శైలిలో క్రియాశీల పాత్రతో బలమైన ముద్ర వేసిన ఆయనే అమిత్ షా. ఆయన అత్యంత శక్తివంతమైన హోం మంత్రిగా ఉన్నారు. ఆయన ప్రధాని నరేంద్ర మోడీ తరువాత స్థానంలో ఉన్నారు. నరేంద్ర మోడీ ఆయనది గొప్ప జోడీ. బీజేపీలో ఆనాడు వాజ్ పేయ్ ఎల్ కే అద్వానీ మాదిరిగా ఈ ద్వయం కూడా కమలం పార్టీని మరింతగా పరుగులు పెట్టించింది. ఈ ఇద్దరూ కలసి బీజేపీకి సరికొత్త రాజకీయ చరిత్రను లిఖించారు. ఇక వరుసగా మూడు సార్లు ప్రధానిగా ఉంటూ వచ్చిన నరేంద్ర మోడీ 2029లో సైతం ప్రధాని అవుతారా అంటే ఏమో డౌటే అన్న మాట వినిపిస్తోంది. ఆనాటికి మోడీకి ఎనభై ఏళ్ళు వస్తాయి. దాంతో ఆయన రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటారని అలా ఖాళీ అయిన ప్రధాని పీఠాన్ని అమిత్ షా అధిరోహించి ఆ స్థానాన్ని భర్తీ చేస్తారని చాలా రకాలుగా ప్రచారం సాగుతూనే ఉంది. అది పుకారుగా ఊహాగానాలుగా కూడా వ్యాప్తిలో విస్తృతంగా ఉంది. ఇదిలా ఉంటే ఇపుడు అమిత్ షా హోం మంత్రి కదా మోడీ ప్రధానిగా మరో నాలుగేళ్ళ పాటు ఉంటారు కదా 2029 గురించి ఇపుడు ఎందుకీ చర్చ అని అనుకోవచ్చు. దానికి అమిత్ షా తాజాగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ఆస్కారాన్ని కల్పించాయని చెప్పాల్సి ఉంది. తాజాగా అమిత్ షా సహకార సంఘాల మహిళా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ఎపుడో జరగబోయే తన రాజకీయ రిటైర్ మెంట్ గురించి ప్రస్తావించారు. రిటైర్మెంట్ తరువాత తాను వ్యవసాయం చేస్తాను అని అమిత్ షా అన్నారు. అలాగే వేదాలు ఉపనిషత్తులు చదువుకుంటూ ఆధ్యాత్మిక లోకం లో ఉంటాను అని చెప్పారు. అయితే రాజకీయంగా చూస్తే అమిత్ షాది పదవీ విరమణ చేసే వయసు ఏమీ కాదు. ఆయన హోం మంత్రిగా కేంద్రంలో గత ఆరేళ్ళుగా ఉంటూ వస్తున్నారు. అంతకు ముందు జాతీయ బీజేపీకి ప్రెసిడెంట్ గా ఉన్నారు. దాని కంటే ముందు గుజరాత్ లో మోడీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్నారు

ఇక అమిత్ షా చూస్తే రాజకీయంగా మంచి పండు వయసులో ఉన్నారు ఆయన ఇంకా ఎక్కాల్సిన శిఖరాలు చాలా ఉన్నాయని అభిమానులు అంటారు. మరి వాటిని పక్కన పెట్టేసి సడెన్ గా ఆయన తన పదవీ విరమణ గురించి చెప్పడంతో అందరి ఆలోచనలు దాని మీదకు మళ్ళుతున్నాయి. ఇక రాజకీయ విశ్లేషణలు చూస్తే మరింత ఆసక్తిని రేపుతున్నాయి. అమిత్ షా రిటైర్మెంట్ గురించి ప్రస్తావించారంటే దాని కంటే ముందు లక్ష్యాలు బహు దగ్గరలో ఉన్నట్లేనా అన్నది కూడా చర్చగా ఉంది. మరో వైపు చూస్తే కేంద్రంలో బలమైన నాయకులుగా మోడీ అమిత్ షా ఉన్నారు. బీజేపీలోనూ అంతే. మరి మోడీ కనుక 2029 ఎన్నికల తరువాత తప్పుకుంటే ప్రధాని అయ్యేది కచ్చితంగా అమిత్ షాయే అన్న ప్రచారం కూడా ఉంది అందుకే ఆయననేనా కాబోయే ప్రధానమంత్రి అని అంతా అంటున్నారు. ఇక చూస్తే కనుక దేశంలో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అవి 2027 చివరిలో జరుగుతాయని అంటున్నారు. అలా విశ్లేషిస్తే బీజేపీకి నాలుగవ సారి విజయం సాధించి పెట్టిన తరువాత మోడీ తప్పుకుంటారా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. బీజేపీలో చూస్తే మరి కొంతమంది పేర్లు కూడా ప్రధాని రేసులో ఉన్నాయని చెబుతారు. అందరి కంటే ముందుగా నితిన్ గడ్కరీ కూడా ఉన్నారు. ఆయన ఈ మధ్యనే ఒక చానల్ కి ఇంటర్వ్యూ ఇస్తూ చూస్తూ ఉండండి రాబోయే కాలంలో ఏమి జరుగుతుందో అని ఊరించారు. అంటే ఆయన ప్రధాని ప్లేస్ లోకి వస్తారా అన్నది కూడా చర్చగా వస్తోంది. అయితే మోడీ అమిత్ షా ఇద్దరూ ఒక్కటే మాట బాట కాబట్టి మోడీ వారసుడు ఎవరు అంటే ఠక్కున గుర్తుకు వచ్చే పేరు అమిత్ షా అనే అంటారు. దాంతో మోడీ రిటైర్మెంట్ ఇపుడు గురుకు వస్తోంది. అమిత్ షా రిటైర్మెంట్ అని అన్నారు కానీ దాని కంటే ముందు మోడీ రిటైర్మెంట్ ఎపుడు అని ప్రశ్న వేసుకుంటే జవాబు కానీ తగిన విధంగా విశ్లేషణ కానీ వస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా బీజేపీలో ప్రస్తుతం ఉక్కు మనిషిగా పేరున్న అమిత్ షా తన లక్ష్యాలను అన్నీ సాధించుకున్న మీదటనే వానప్రస్థాశ్రమం స్వీకరిస్తారు అని అంటున్నారు. అంటే మోడీ నుంచి పగ్గాలు అందుకున్న తరువాతనే అన్న మాట. ఇక గుజరాత్ నుంచి మోడీ ప్రధాని అయ్యారు. మళ్ళీ అదే గుజరాత్ నుంచి రాబోయే కాలానికి కాబోయే ప్రధానిగా అమిత్ షా వస్తున్నారా అంటే ఇపుడున్న రాజకీయ వాతావరణం చూస్తే అది జరిగినా ఆశ్చర్యం లేదని చెప్పాల్సి ఉంటుంది. మొత్తం మీద ప్రధాని పీఠానికి అతి దగ్గరగా మాత్రం అమిత్ షా ఉన్నారు అన్నది నిస్సందేహం. ఎనీ డౌట్స్.

# కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రండి.. తేల్చుకుందాం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, మహిళలందరితో కలిసి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదేపదే కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని కోరడాన్ని ప్రస్తావిస్తూ, తాము చర్చకు సిద్ధమంటూ ప్రతి సవాల్ చేశారు.

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ జాగృతి విస్తృత స్థాయి సమావేశంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500, తులం బంగారం ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి? పింఛన్ల పెంపు సంగతేమిటి? ఈ అంశాలపై చర్చించేందుకు మేం సిద్ధం. మీరు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రండి, తేల్చుకుందాం" అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని, ఆయన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ మాట నిలబెట్టుకోవాలని కవిత డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలకు వెళితే చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా 'రైల్ రోకో' నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీల సమస్యను ప్రస్తావించిన కవిత, వాటిని తెలంగాణలో విలీనం చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకోవాలని కోరారు. పురుషోత్తపట్నంలో భద్రాచలం ఆలయ భూముల పరిశీలనకు వెళ్లిన ఈవో రమాదేవిపై జరిగిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడని ఆమె వ్యాఖ్యానించారు.

# వైద్యుల సూచన మేరకు యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి

ఈ నెల 5న డిశ్చార్జ్ అయ్యారు. ఆ సమయంలో రక్తంలో షుగర్, సోడియం స్థాయులను పర్యవేక్షించేందుకు ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. డిశ్చార్జ్ సమయంలో వారం రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత తదుపరి పరీక్షల కోసం మళ్లీ రావాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు వారం రోజుల విశ్రాంతి అనంతరం కేసీఆర్ మళ్లీ ఆసుపత్రికి వెళ్లారు.

# వరంగల్ కాంగ్రెస్ పంచాయితీ మళ్లీ గాంధీ భవన్‌కు..

- మొదటి పేజీ తరువాయి

ఈ భేటీలో పాల్గొన్నారు. కొండా మురళి వ్యవహారంపై వీరంతా తమ వాదనలను కమిటీ ముందు వినిపించారు.

ఇటీవల కొందరు కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ నోటీసుకు కొండా మురళి ఇదివరకే తన వివరణను సమర్పించారు. ఇప్పుడు ఆయనపై అసంతృప్తిగా ఉన్న నేతలు తమ వాదనలు వినిపించేందుకు కమిటీని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారు: బీఆర్ఎస్‌పై ఎంపీ చామల ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని వ్యాఖ్యానించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం ఆయన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వానికి సవాల్ విసరాల్సింది ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అని, కేటీఆర్ కాదని అన్నారు. నిజంగా దమ్ముంటే కేటీఆర్ తన తండ్రి నుంచి ప్రతిపక్ష హోదా తెచ్చుకుని మాట్లాడాలని సూచించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మిగులు బడ్జెట్‌తో అధికారం చేపట్టిన కేసీఆర్, రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఆరోపించారు. ఆ నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందేదని అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన 299 టీఎంసీల నీటిని పదేళ్ల పాలనలో ఎప్పుడూ పూర్తిగా వాడుకోలేకపోయారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక గత ఏడాది 280 టీఎంసీలు వాడుకున్నామని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించబోమని, ఆరు నూరైనా దాన్ని అడ్డుకుని తీరుతామని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే 60,000 ఉద్యోగాలు భర్తీ చేసిందని, గత ప్రభుత్వం కేవలం నోటిఫికేషన్లకే పరిమితమైందని ఆయన విమర్శించారు.

# చేనేత రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయండి

- మొదటి పేజీ తరువాయి

ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోపే ఆర్డర్లు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే అందిన ఆర్డర్లకు సంబంధించిన వస్త్రాలను వేగంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, హైదరాబాద్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని ఏడాదిలోగా యాదాద్రి జిల్లా పోచంపల్లికి శాశ్వతంగా తరలించాలని ఆదేశించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరిచి, 'మహిళా శక్తి' చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షలో భాగంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,691 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారని, వెరిఫికేషన్ పూర్తి కాగానే నిధులు విడుదల చేస్తామని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం కింద 194 మంది మృతుల కుటుంబాలకు రూ. 9.70 కోట్లు అందించినట్లు ఆమె పేర్కొన్నారు.

అనంతరం, 2024 సంవత్సరానికి గాను జాతీయ చేనేత పురస్కారాలకు ఎంపికైన పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్‌లను మంత్రి తుమ్మల శాలువాతో సత్కరించారు. తెలంగాణ చేనేతకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం గర్వకారణమని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# షేక్ హసీనాను అప్పగించండి భారత్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి విజ్ఞప్తి

- మొదటి పేజీ తరువాయి

సముచితం కాదు" అని యూనస్ ప్రభుత్వం ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి భారత్ వంటి ప్రజాస్వామ్య దేశం ఆశ్రయం కల్పించడం సబబు కాదని హితవు పలికింది. చట్టం ముందు ఎంతటి శక్తిమంతులైనా సమానులేనని, బాధితులకు న్యాయం జరగాల్సిందేనని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పౌరులను ఉద్దేశపూర్వకంగా హత్య చేసిన వారిని ప్రాంతీయ బంధాలు లేదా రాజకీయ నేపథ్యం కాపాడలేవని తేల్చి చెప్పారు. చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య సమగ్రత వంటి ఉమ్మడి విలువల పట్ల భారత్ గౌరవం ప్రదర్శించాలని యూనస్ ఆ ప్రకటనలో కోరారు. గత సంవత్సరం విద్యార్థుల ఆందోళనల కారణంగా అధికారం కోల్పోయిన షేక్ హసీనా, ఆగస్టు 5 నుంచి భారత్‌లో తలదాచుకుంటున్నారు. నిరసనల సందర్భంగా ఆమె పార్టీ అవామీ లీగ్ మద్దతుదారులు, మైనారిటీ వర్గాలపై దాడులు జరిగాయి. ఈ అల్లర్లలో దాదాపు 1400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అనంతరం బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన యూనస్ ప్రభుత్వం, హసీనాపై హత్యతో సహా పలు కేసులు నమోదు చేసింది. ఇదివరకే ఒక కోర్టు ధిక్కరణ కేసులో అక్కడి అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఆమెను స్వదేశానికి రప్పించేందుకు బంగ్లా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

# తెలంగాణ ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలి

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎస్. మాధవ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో కూడిన పటాన్ని బహుమతిగా ఇవ్వడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రజల పోరాటాన్ని అవమానించడమేనని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ప్రధాని మోదీని ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడి చర్య తెలంగాణ ప్రజలను, రాష్ట్రాన్ని, చరిత్రను అవమానించే విధంగా ఉందని కేటీఆర్ అభివర్ణించారు. "మా సాంస్కృతిక గుర్తింపు, చారిత్రక స్థానం, భౌగోళిక ఉనికి కోసం తరతరాలుగా పోరాడి తెలంగాణను సాధించుకున్నాం. అలాంటిది మీ ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ అస్తిత్వాన్ని విస్మరించి 'అఖండ ఆంధ్రప్రదేశ్' పటాన్ని బహూకరించడం మా పోరాటాన్ని కించపరచడమే" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, తెలంగాణ ప్రజల పట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరిని ఇది స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. "మా చరిత్రను చెరిపేస్తే మాకు అస్తిత్వం ఎక్కడ ఉంటుంది?" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి ఆయన సూటి ప్రశ్నలు సంధించారు. ఇది మీ పార్టీ రాజకీయ ప్రణాళికలో భాగమా లేక అజెండానా అని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇది పొరపాటున జరిగిన తప్పిదమైతే బీజేపీ నాయకత్వం తెలంగాణ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# వాళ్లను భర్తీ చేయడం ఏఐ వల్ల కూడా కాదు

- మొదటి పేజీ తరువాయి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదని, కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు.

బిల్ గేట్స్ మాట్లాడుతూ, "ప్రోగ్రామింగ్‌లో డీబగ్గింగ్ వంటి కొన్ని బోరింగ్ పనుల్లో ఏఐ మనకు సాయం చేస్తుంది. అంతేగానీ, మన స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయదు. క్లిష్టమైన సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు కనుగొనడమే ప్రోగ్రామింగ్‌లో అసలైన సవాలు. యంత్రాలు దానిని చేయలేవు. కోడింగ్‌కు విచక్షణ, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు తగ్గట్లు సర్దుబాటు కావడం వంటి లక్షణాలు అవసరం. ఈ సామర్థ్యాలు ఏఐలో లోపించాయి" అని వివరించారు. కోడింగ్ రాయడం అంటే కేవలం టైప్ చేయడం కాదని, దాని వెనుక లోతైన ఆలోచన, మానవ మేధస్సు ఉంటాయని ఆయన తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనాలపైనా బిల్ గేట్స్ స్పందించారు. 2030 నాటికి ఏఐ వల్ల ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలు పోయే అవకాశం ఉండగా, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు కూడా సృష్టించబడతాయని ఫోరమ్ పేర్కొంది. ఈ విషయంపై గేట్స్ మాట్లాడుతూ, ఏఐతో ముప్పు పొంచి ఉందనే విషయంలో తనకూ కొంత ఆందోళన ఉందని అంగీకరించారు. అయితే, కృత్రిమ మేధను తెలివిగా వినియోగించుకుంటే మన ఉత్పాదకత పెరగడమే కాకుండా, మరింత ఖాళీ సమయం కూడా లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలోనూ కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ వంటి రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువని ఆయన అంచనా వేసిన విషయం తెలిసిందే.

# దలైలామా వారసుడు చైనా నుంచి మాత్రం రాడు

టిబెటన్ల తదుపరి ఆధ్యాత్మిక గురువు దలైలామా ఎంపిక విషయంలో చైనాకు ఎలాంటి పాత్ర ఉండదని, దలైలామా వారసుడు చైనా నుంచి రాడని అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తేల్చి చెప్పారు. భవిష్యత్తు దలైలామా స్వేచ్ఛా ప్రపంచం నుంచే వస్తారని, ప్రజాస్వామ్య విలువలు లేని చైనా ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీలో పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

తదుపరి దలైలామా ఎంపిక ప్రక్రియపై చైనా చేస్తున్న వాదనలను పెమా ఖండూ తోసిపుచ్చారు. "చైనా ఈ విషయంపై ఎందుకు అభ్యంతరం చెబుతోందో నాకు అర్థం కావడం లేదు. దలైలామా వ్యవస్థ చైనాలో లేదు. దానిని ప్రధానంగా హిమాలయ ప్రాంతంలోని టిబెటన్ బౌద్ధులు మాత్రమే గుర్తిస్తారు. కాబట్టి ఇందులో చైనాకు ఎలాంటి పాత్ర లేదు," అని ఆయన అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవించే దేశం నుంచే తదుపరి దలైలామా వస్తారని ఖండూ వివరించారు.

ప్రస్తుత 14వ దలైలామా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, ఆయన 130 ఏళ్ల వరకు జీవిస్తారని ఆయనే స్వయంగా చెప్పారని పెమా ఖండూ గుర్తుచేశారు. దలైలామా దీర్ఘాయుష్షుతో ఉండాలని తామంతా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత దలైలామా కాలం చేసిన తర్వాతే, సుమారు 600 ఏళ్ళుగా కొనసాగుతున్న సంప్రదాయ పద్ధతుల ప్రకారం తదుపరి వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు.

# కోట్నాపల్లి నల్లరాయి దోపిడి పై సీబీఐ దర్యాప్తు వెంటనే చేపట్టాలి.

- కారకులైన అధికారులను కఠినంగా శిక్షించాలి.
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్.



**పెన్ పవర్.హుకుంపేట జూలై 10 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం 10.07.2025 కొట్నాపల్లి నల్లరాయి క్వారీ అనుమతులు మరియు వాటి నిర్వహణకు సంబంధించి సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు.ప్రలోభాలకు లొంగిపోయిన అధికారులు తప్పుడు నివేదికలు సృష్టించి అనుమతులు మంజూరు చేయించారు.తద్వారా కోట్ల రూపాయలు చేతులు మారాయి. అని ఆయన ఆరోపించారు.

వీటిపై సీబీఐ సమగ్ర విచారణ చేపట్టాలి అని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉప అధ్యక్షులు టి. క్రిష్ణారావు పత్రిక ప్రకటన ద్వారా డిమాండ్ చేస్తున్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్నాపల్లి లో క్వారీ నిర్మాణం పై పిసా గ్రామ సభ తీర్మానం లేనందున,ఆదివాసీ గిరిజన సంఘం గతంలో తీవ్రస్థాయిలో వ్యతిరేకించినట్లు వారు గుర్తు చేశారు.

అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్,స్థానిక ఐటిడిఎ పి ఓ మరియు సబ్ కలెక్టర్ కల్పించుకొని ఈ క్వారీ ఏర్పాటు అభివృద్ధిలో భాగమని, ఎన్ హెచ్ 516 ఈ. రోడ్డు నిర్మాణం కోసం క్వారీ ఏర్పాటు జరుగుతుందనీ, క్వారీ ప్రభావిత గ్రామల ప్రజలకు,గిరిజన సంఘం నాయకులకు తెలియజేసినట్టు వారు పేర్కొన్నారు.

అప్పటి అధికారులు పరిమితులతో కూడిన అనుమతులు జారీ చేసినట్టు వారు తెలిపారు.

వాటిని ఆసరగా చేసుకొని క్వారి యజమానులు అనుమతులు ముగిసినప్పటికీ అధికారులకు నెలవారీ మామూళ్లు ముట్టజేపి క్వారీ యధావిధిగా నిర్వహిస్తూ ఎత్తున దోపిడికి పాల్పడుతున్నారు.

తక్షణమే సిబిఐ విచారణ జరపాలని లోపాయికార ఒప్పందం కుదుర్చుకోన్న సంబంధిత అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్వారీ ప్రభావిత బాధిత ప్రజలు గత నెల రోజులుగా చేపడుతున్న ఆందోళనలకు ఎట్టకేలకు స్పందించిన

రెవెన్యు అధికారులు తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులుదులుపుకుంటున్నార.క్వారీ శాశ్వతంగా మూసివేయాలి.

క్వారీ వల్ల ప్రజలకు జరిగిన నష్టాన్ని రెవెన్యూ అధికారులే ఇప్పించాలి. క్వారీ ఎగ్రిమెంట్ ప్రకారం పంచాయితీకి చెల్లించాల్సిన డబ్బు తక్షణమే చెల్లించాలి.ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘించి నిర్వహించిన అక్రమ మైనింగ్ పై ప్రశ్నించిన బాధితులపైనా,వాటిని నిజాయితీగా భాహ్యప్రపంచానికి తెలిలజేసిన మీడియా ప్రతినిధులు పైనా బనాయించి అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి అని వారు డిమాండ్ చేశారు

# 2.0 మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ కు విశ్లేష స్పందన.




**హుకుంపేట పెన్ పవర్ జూలై 10** రాష్ట్రవ్యాప్తంగా 2.0 మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి విశ్లేష స్పందన వచ్చింది. అని పలువురు పేర్కొన్నారు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నడూ లేని విధంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం మెగా పేరెంట్స్ మరియు టీచర్స్ సమావేశం ఏర్పాటు చేస్తూ వస్తుందని దీనివల్ల విద్యార్థులు తల్లిదండ్రులకు మరియు పాఠశాల ఇబ్బందులకు మంచి అభినవ సంబంధాలు ఏర్పడుతున్నాయని అలాగే విద్యార్థులకు సమస్యలను తల్లిదండ్రులు తెలియజేస్తూ పాఠశాల సిబ్బంది. వారి పనితీరును విద్యార్థి ఒక తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తల్లిదండ్రులు వారు పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి. అన్ని క్షుణంగా తెలుసుకుంటున్నారని విద్యార్థులు కూడా పాఠశాల ఆవరణంలో ఏ విధంగా ఉంటున్నారో తల్లితండ్రులు నేరుగా సిబ్బంది తెలియజేయడంలో కూడా ఈ పేరెంట్స్ మీటింగ్ ఉపయోగకరంగా ఉందని పలువురు విద్యార్థులు తల్లితండ్రులు మరియు సిబ్బంది పేరెంట్స్ 2.0 మీటింగ్స్ ద్వారా తెలియజేశారు.

# మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్. సదస్సులో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించిన డాక్టర్ సౌమ్య.




**హుకుంపేట పెన్ పవర్ జూలై 10:**

మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సదస్సు హుకుంపేట కేంద్రంలో నాలుగు పాఠశాలలో జరగా విద్యార్థులకు గాని వారి తల్లిదండ్రులు గాని ఎటువంటి అనారోగ్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. హుకుంపేటలో ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

దూర ప్రాంతంలో వచ్చిన తల్లిదండ్రులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను మరియు వారికి కావలసిన మందులు కూడా అందజేశామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది ఏఎన్ఎంలు

ఎం ఎల్ హెచ్ పి లు. హెల్త్ అసిస్టెంట్లు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# 87 వ వార్డులో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం






**గాజువాక పెన్ పవర్ జూలై:**జీవీఎంసీ 87వ వార్డు పరిధి ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశంసారం తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణితి, వడ్లపూడి, దుగ్గాపూవాణిపాలెం, అప్పికొండ మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే చోట కలిసే ఓ మంచి కార్యక్రమం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు తీసుకున్నారని.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటలు పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటడం జరిగిందని, మొక్కలు నాటిన వారికి గ్రీన్ పాస్పోర్ట్ ఇవ్వడం జరిగింది. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసిన ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, సీనియర్ నాయకులు పావాడ వెంకటరమణమూర్తి, ద్రోణాద్రి అప్పలనాయుడు, కణితి ఈశ్వరరావు,జాన్ రమేష్, కదుపుట్ల శ్రీను, పివిఎన్ మూర్తి, దాలయ్య, ఎస్. కిరణ్,సుందర్ సునీల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవంతంగా మెగా పేరెంట్స్ మీటింగ్ 2.0.








**హుకుంపేట పెన్ పవర్ జూలై 10.** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మెగా పేరెంట్స్ మీటింగ్ 2.0 హుకుంపేట మండలంలో కూడా ఘనంగా జరిగింది. స్థానిక కేజీబీవీ పాఠశాలలో. ప్రిన్సిపల్ అనిత ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ రాజబాబు మరియు ఎంఈఓ ఈశ్వరరావు. ఏ ఈ సంజీవరావు సిపిడిఓ జి సువర్ణ ఏవో సన్యాసిరావు. తదితరులు ముఖ్య అతిథిగా పాల్గొనగా. విద్యార్థులు వారిని స్వాగతించగా తల్లితండ్రులు ఉపాధ్యాయులు. నడుమ అనేక అంశాలతో మెగా పేరెంట్స్ 2.0 జరిగింది. ఎంపీపీ రాజబాబు మరియు ఎంఈఓ ఈశ్వరరావు విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు అనేక అంశాలను వివరించారు. అలాగే పిల్లలు పాఠశాల ఆవరణంలో ఏ విధంగా ఉంటున్నారో ఏ విధమైన ఆహారం వరకు అందుతుందో వారి తల్లిదండ్రులకు క్షుణ్ణంగా పాఠశాల ప్రిన్సిపల్ వివరించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజ్ హుకుంపేట లో కూడా మెగా పేరెంట్స్ 2.0 జరిగింది ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ సమ్మె పూర్ణిమ హాజరుకాగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ విద్యార్థుల తల్లితండ్రులతో అనేక అంశాలపై చర్చించారు మరియు ప్రోగ్రెస్ రిపోర్టర్లను వారికి అందించారు. తదుపరి విద్యార్థులు తల్లిదండ్రుల మ్యూజికల్ చైర్ మరియు తాడు లాగుట ఇలాంటి ఆటలు ఆడించి వారికి బహుమతులు అందజేశారు. ఫోటో ఫ్రేమ్ లో వంటి ఏర్పాటు చేసి వాటితో విద్యార్థులు తల్లిదండ్రులు మరియు విద్యార్థులతో ఫోటోలు దిగి పేరెంట్స్ మీటి యొక్క ప్రాధాన్యతను ఆయన తెలిపారు అలాగే జి టి డబ్ల్యూ ఏ ఎస్ బాలుర రెండు పాఠశాలలో. ముఖ్యఅతిథిగా వైస్ ఎంపీపీ సూడుపల్లి కొండలరావు. ను ఆహ్వానించారు. మరియు ఎంఈఓ లను మరియు స్థానిక సర్పంచును ఆహ్వానించారు జి టి డబ్ల్యూ బాలుర రెండులో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. తదుపరి ఆటపాటలతో మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది. అలాగే హుకుంపేట ప్రభుత్వ పాఠశాలలో హెడ్మాస్టర్ సువర్ణ రాజు ఆధ్వర్యంలో. మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది విద్యార్థులు ఆటపాటలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పేరెంట్స్ మీటింగ్ ను ఘనంగా నిర్వహించారు. జిటిడబ్ల్యు బాలుర 1లో హెడ్మాస్టర్ బాలాజీ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ముందుగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ మీటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం తెలియజేస్తూ పిల్లలు యొక్క ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు తదుపరి విద్యార్థులు తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు విద్యార్థులు తల్లులు ముగ్గుల పోటీలో పాల్గొని ఎంత ఉత్సాహంగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అని ఆయన తెలిపారు. అలాగే జి టి డబ్ల్యూ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ మీనా కుమారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా సిఐ సన్యాసినాయుడు విద్యా కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు మరియు వైస్ చైర్మన్ రమణమ్మ. మరియు విద్యార్థులు తల్లిదండ్రులను సిబ్బంది ఆహ్వానించారు ఇందులో భాగంగా సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా మెలగాలి వారు సమాజంలో ఏ విధంగా ఉండాలి ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోహించాలని సి ఐ సన్యాసి నాయుడు తెలిపారు. అలాగే విద్యను తల్లిదండ్రులతో కూడా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తుకు కావలసినటువంటి సూచనలు ఆయన వారికి తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్






- ఉపాధ్యాయులు,తల్లిదండ్రులతో కలిసి పిల్లలకు
- తగు సూచనలు, సలహాలు ఇచ్చిన కార్పొరేటర్ మొల్లి హేమలతలి

**భిమిలి, పెన్ పవర్, జులై 10 :**కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) 5 వ వార్డులో గల పరదేశి పాలెం, బోరవాణి పాలెం, మారికవలస, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, శివశక్తి నగర్, బొట్టవానిపాలెం, నగరం పాలెం, సాయిరాం కాలనీ లలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మొల్లి హేమలత పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న తల్లిదండ్రుల ఉపాధ్యా యుల ఆత్మీయ సమావేశం వలన పిల్లల భవి ష్యత్తును చక్కగా తీర్చిదిద్దే విధంగా ఉంటుంద ని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్య శాఖ పై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండేటట్టు అన్ని సౌక ర్యాలు కల్పిస్తున్నారని, డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణ పేరుతో పిల్లలకు పుస్తకాల కిట్లను అందిస్తు న్నారని, డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న%శీ% పౌష్టిక ఆహారం అందిస్తున్నారని, గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో అన్ని స్కూళ్లను నిర్వీర్యం చేసి నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేసింద ని, దానిపై ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్ర బాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేశారని, తొందరలోనే అన్ని పాఠశాలలో సంపూర్తిగా నిర్మాణాలు పూర్త వుతాయని ఆమె అన్నారు. పిల్లల భవిష్యత్తు లో తల్లిదండ్రులు తో పాటు ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా చర్య లు చేపట్టాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఉన్నత విద్యావంతులు ప్రతిభావం తులైన ఉపాధ్యాయులను నియమిస్తుందని వారు అన్నీ విధాలగా శిక్షణ పొంది పిల్లలకు విలువలతో కూడిన విద్యను బోధిస్తారని, కావున తల్లిదండ్రులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించడానికి సంకోచించకూడదని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎంతోమంది ఉన్నత స్థితికి చేరు కున్నారని కావున ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు దేవర శివ, కొండపు రాజు, ముచ్చి రామనాయుడు, బోర అప్పల సూరిబాబు రెడ్డి, శ్రీకాంత్, ఎర్రయ్య రెడ్డి, మన్యాల సురేష్ స్థానిక మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల్లో చురుకుగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



**గాజువాక పెన్ పవర్, జూలై 10:**మహా విశాఖ నగరపాలక సంస్థ 66 వార్డు లో సుపరిపాలన తొలి అడుగు 203 బూతులో నిర్వహించారు.

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చురుకుగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేపట్టారు. ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేస్తూ అభివృద్ధికి బాటలేస్తూ ఆంధ్ర రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ ఉండేదని ఇప్పుడు కూటమి ప్రభుత్వం ద్వారా మరి అనేక పరిశ్రమలు ఈ రాష్ట్రానికి రావడం అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమంలో ఆంధ్ర రాష్ట్రం దూసుకు పోతుందని గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ నాయకత్వంలో గాజువాకలో పలు అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని ,66వ వార్డ్ లో ఉన్నటువంటి ప్రజలందరూ సంతోష పడుతున్నారని తమ అభిప్రాయం వెల్లడించారు.ఈ కార్యక్రమంలో 66 వార్డ్ మాజీ కార్పొరేటర్ 66 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ రఫీ , లక్ష్మణరావు ,భాషా , చక్రధర్, వంశీ ,చంద్ర రావు ,పూడి నాగేశ్వరరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ తో మేఘాలయ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బృందం భేటీ



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జూలై 10 :**

స్టడీ టూర్ నిమిత్తం గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్న మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బృంద సభ్యులు మర్యాదపూ ర్వకంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను తన ఛాంబర్లో కలిశారు.ఈ క్రమంలో వివిధ అంశాలపై చర్చించుకున్నారు. వీళ్లంతా జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తారు. విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ప్రాజెక్టులు, ఇతర అంశాలను క్షేత్రస్థాయి లో పరిశీలిస్తారు. పోర్ట్, క్రూయిజ్, లాంజ్ తది తర ప్రాంతాలను సందర్శిస్తారు.జిల్లా పర్యటన అనంతరం 12న వారు భువనేశ్వర్ వెళ్తారు. కలెక్టర్ ను కలిసిన వారిలో కమిటీ ఛైర్మన్, ఆ రాష్ట్ర ప్రజా ప్రతినిధులు,అధికారులు, సలహా దారులు తదితరులు ఉన్నారు.

# గూడెం కొత్తవీధిలో కేజీబీవీ పాఠశాలలో మెగా పేరెంట్ మీటింగ్ ఘనంగా నిర్వహణ






**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో (కేజీబీవీ) పండగ వాతావరణంలో మెగా పేరెంట్ మీటింగ్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల చైర్మన్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ బుజ్జిబాబు, ఏవో ఇమ్మానియేల్, పెన్ పవర్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు, కూటమి నాయకులు సిద్ధార్థ మార్క్, వైద్యులు డాక్టర్ అచ్యుత్ హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుండి చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకొని, భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. డాక్టర్ అచ్యుత్ ప్రత్యేకంగా బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈవో ఇమ్మానియేల్ మాట్లాడుతూ, విద్యార్థులు అంకితభావంతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మొబైల్ ఫోన్లపై అధిక ఆధారపడకుండా, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "తల్లికి వందనం" కార్యక్రమంలో బాలికలు తమ తల్లుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం తల్లులతో కలిసి కుర్చీ ఆట, ఇతర వినోదాత్మక క్రీడలు నిర్వహించగా, ఇది అందరినీ ఆకట్టుకుంది. అంతేకాక, "తల్లి పేరుట ఒక మొక్క" కార్యక్రమాన్ని కూడా నిర్వహించి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ధుమంతి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్య పడల్, రెవెన్యూ శాఖ సిబ్బంది, విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# శ్రుష్టి వరల్డ్ స్కూల్, ఉక్కునగరం - మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై దృష్టి






**గాజువాక :పెన్ పవర్ ,జూలై 10:**ఉక్కునగరంలోని శ్రుష్టి వరల్డ్ స్కూల్లో గ్రేడ్ 1 విద్యార్థుల తల్లిదండ్రుల కోసం జీవన నాణ్యతను మెరుగుపరిచే మంచి ఆహార అలవాట్లు అనే అంశంపై మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ను నిర్వహించారు .ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, అధ్యాపకులు మరియు ప్రముఖ అతిథులు హాజరై దీన్ని విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యాఆకర్షణగా, విశాఖపట్నం స్టీల్ జనరల్ హాస్పిటల్‌లో బాలల వైద్య విభాగానికి హెడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ జితేంద్రనాథ్ సారంగి ఎం బి బి ఎస్ , ఎం డి పీడియాట్రిక్ ప్రత్యేకంగా హాజరై తన ప్రేరణాత్మక ఉపన్యాసాన్ని అందించారు.

ఆయన తల్లిదండ్రులను ఉద్దేశిస్తూ పిల్లలు తల్లిదండ్రుల ప్రతిబింబాలు అన్నారు. ప్రత్యేకించి జంక్ ఫుడ్స్, చాక్లెట్లు, చల్లని పానీయాల్లో ఉన్న అధిక పంచదార వల్ల పిల్లల్లో ఏర్పడే ఊబకాయం గురించి ఆయన హెచ్చరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పిల్లల్లో పెంపొందించేందుకు మానసికంగా మరియు శారీరకంగా వారిని ప్రోత్సహించాలన్నారు.

వెల్నెస్ విజ్ఞం పేరుతో నిర్వహించిన ఈ సెషన్‌లో, శారీరక ఆరోగ్యం, తక్కువ క్యాలరీలతో కూడిన ఆహారం, వ్యాయామం, యోగా వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు.

ఈ సమావేశానికి 'ప్రముఖ సైకాలజిస్ట్,శ్రుష్టి వరల్డ్ స్కూల్ డైరెక్టర్ సుశీలా రాణి ప్రత్యేక అతిథిగా హాజరై ఆరోగ్యాన్ని విద్యలో భాగంగా తీసుకురావడంపై ఆమె దృఢ నిబద్ధతను వివరించారు. పిల్లల మానసిక, భావోద్వేగ అభివృద్ధిపై ఆమె చేస్తున్న సేవలు శ్రేయోభిలాషులందరినీ ఆకట్టుకున్నాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు కేర్ అండ్ గ్రో సీఈవో మేఘన కంభం చిన్నపిల్లల అభివృద్ధిపై దేశంలోనే మొట్టమొదటిగా ప్రారంభించిన ప్రోగ్రామ్‌కి గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమం భారతదేశవ్యాప్తంగా విద్యార్థుల అభ్యున్నతికి సేవ చేస్తోంది.

ఈ సమావేశం మార్గదర్శకతతో పాటు ధైర్యాన్నిచ్చే ఆత్మవిశ్వాసంతో ముగిసింది. శ్రుష్టి వరల్డ్ స్కూల్ పిల్లల సమగ్ర అభివృద్ధికి ఎంత నిబద్ధంగా పని చేస్తుందో ఇది మరొకసారి నిరూపించింది.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు-పల్లా శ్రీనివాసరావు





**గాజువాక : పెన్ పవర్, జూలై 10:**ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను కూటమి ప్రభుత్వం నడిపిస్తుందని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఘనంగా చేపట్టిన పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో ఎమ్మెల్యే పల్లా చేతుల మీదగా అధికారులు ప్రారంభించారు.

ముఖ్యంగా టీచర్స్ పేరెంట్స్ మధ్య పిల్లలు యొక్క భవిష్యత్తు ఆధారపడి ఉందని, పిల్లలు యొక్క చదువు భవిష్యత్తు కోసం పేరెంట్ టీచర్ మధ్య సమావేశం జరిగితే భవిష్యత్తు చాలా గొప్పగా ఉంటాయని భావించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పల్లా అన్నారు .

హోలిస్టిక్, గ్రీన్ పాస్పోర్ట్, హెల్త్ కార్డ్ అనే నూతన ఒరవడికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పూనుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, దీని ద్వారా విద్యార్థులు పేరెంట్స్ పిల్లలు బడికి పంపించడానికి చాలా సంతోషకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.

కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, జనసేన నేత గుంటూరు నరసింహమూర్తి, టిడిపి నాయకులు ఈటి శ్రీనివాసరావు 68 వ వార్డు టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశం





**గాజువాక: పెన్ పవర్, జూలై 10:**జివిఎంసి 69వ వార్డు లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి,విద్యార్థినిల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకి గోవిందరెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకి చేస్తున్న మంచి అలాగే ప్రభుత్వా పాఠశాలలో కల్పిస్తున్న మోలిక సదుపాయాలు గురించి పిల్లలు తల్లితండ్రులకి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యాకమిటి చైర్మన్స్,ఉపాధ్యాయలు మరియు పిల్లలు తల్లీ తండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి.





ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్.

**పరవాడ (పెన్ పవర్) జూలై 10:** విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహిస్తే వారు ఉన్నతమైన విద్యను అభ్యసించడానికి దోహదపడుతుందని ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్ సమావేశాలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ముందు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్ప గుచ్ఛం ఇచ్చి ఎంపీపీకి ఇతర నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ చదువుకునే విద్యార్థులతో మాట్లాడి, ఆ విద్యార్థుల ఆలోచనలు, ఆసక్తిని అడిగి తెలుసుకుని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, మీరు అనుకున్న విజయాలు దిశగా అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో మంచి పాఠశాలలతో పాటు, మానసిక, శారీరక అభివృద్ధికి తల్లిదండ్రుల దృష్టి అవసరమని గుర్తు చేశారు. పిల్లలకు మొబైల్ ఫోన్స్ ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు టీచర్స్ కూడా ఆ ప్రమాదంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత 65% నుండి 100% కు తీసుకు వెళ్లేలా టీచర్లతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, తల్లిదండ్రుల యొక్క కార్యక్రమానికి వచ్చి పిల్లలు సంతోషంలో భాగస్వాములు అయ్యారని తమ అమూల్యమైన సందేశం ఇచ్చారు. అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులకు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్కా రామనాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, వైసీపీ నాయకులు పైల రాధాకృష్ణ, పైల టీవీ అప్పారావు,

బిజెపి నాయకులు కుంద్రాపు సోమినాయుడు, వ్యవసాయ అధికారి ఎం రమాదేవి, ముఖ్య నాయకులు పైల అప్పారావు, పైల హరీష్, పైల అప్పలనాయుడు, వెన్నెల సన్యాసిరావు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను నమ్మి చదువుతున్న లక్షలాది పిల్లల కోసం మన బాధ్యత





- విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పటిష్టమైన బాటలో ప్రభుత్వ చర్యలు
- మెగా పీటీఎం 2.0 లో విశాఖ ఎం.పీ.భరత్
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎం.పీ భరత్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూలై 10** :విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు- ఉపాధ్యాయు ల సమావేశాలు పీటీఎం 2.0 అద్భుతంగా జరిగాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా స్పందించారు. ఈ నేపథ్యంలో భీమిలి, విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భీమిలి నియోజకవర్గంలో ఎస్ ఎస్ కాలనీ జడ్పీహెచ్ఎస్ స్కూల్, విశాఖ దక్షిణ నియో జకవర్గంలోని డాబా గార్డెన్స్ వద్ద ఉన్న ఉమెన్స్ కాలేజీ, ఎన్‌జీజీో కాలనీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల, 42వ వార్డులోని కె.ఎం. హైస్కూల్ లో నిర్వహించిన పీటీఎం సమావేశాల్లో పాల్గొన్నా రు. ఈ సంద ర్భంగా ఎం.పీ.భరత్ మాట్లాడుతూ "రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఉపాధ్యా యుల బదిలీల వ్యవహారంలో రాజ కీయ లాభనష్టాలను పక్కన పెట్టి, పారదర్శక తతో వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి గారి చర్యలు శ్లాఘనీయమైనవి. ఈ దిశగా ప్రభుత్వ నడక మరింత మంచి ఫలితాలను తీసుకురా వాలని ఆశిస్తున్నా," అన్నారు. తల్లిదండ్రులతో మాట్లా డుతూ %-% "విద్యార్థులు మత్తు పదార్థా లకు బానిసలు కాకుండా ఉండేందుకు మనమం తా కలిసి పనిచేయాలి. స్కూళ్ల పరిసరాల్లో మ త్తు పదార్థాల ప్రభావం కనిపించకుండా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. విద్యార్థులు మంచి పౌరులుగా ఎద గాలంటే కుటుంబం, పాఠశాల ఒకటిగా పనిచే యాలి," అని పిలుపునిచ్చారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థను మార్పు దిశగా నడిపేందుకు ప్రభు త్వం చేపడుతున్న కార్యక్రమాలకు సమాజం నుండి పూర్తి మద్దతు అవసరమని ఎం.పీ.భరత్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సమావేశాలు పాఠ శాలల స్థాయిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచి, విద్యార్థుల మానసిక వికాసానికి దోహ దపడతాయని అన్నారు. "ప్రభుత్వ విద్యను నమ్మి చదువుతున్న లక్షలాది పిల్లల కోసం మన బాధ్యత మరింత పెరుగుతుంది," అంటూ ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన చైతన్యపరిచారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ గాజువాక సమతకి పురస్కారాలు





**గాజువాక పెన్ పవర్, జూలై 10:**ఆంధ్రప్రదేశ్ రోటరీ క్లబ్ సారధ్యంలో రాజమహేంద్రవరంలో జరిగిన రోటరీ విజయం డిస్ట్రిక్ట్ అవార్డ్స్ ఫంక్షన్ కి 2024-2025 కి రోటరీ క్లబ్ ఆఫ్ గాజువాక సమత కి ఏడు అవార్డులు రావడం జరిగింది. ఈ అవార్డ్స్ ని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు చేతుల మీదుగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సిరట్ల శ్రీనివాస్ , లక్ష్మణరావు, హిమంత్, జాన్ డీన్, వెంకట్రావు, సత్యవాణి మరియు సూర్యనారాయణ అందుకోవడం జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ సిరట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖపట్నం కి గాను అత్యధిక అవార్డులు గాజువాక సమతాకే దక్కాయని ఈ సంవత్సరం చేసిన సేవా కార్యక్రమాలకి క్లబ్ మెంబర్స్ సహకారంతో ఈ అవార్డులు లభించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఎకనామిక్ కమ్యూనిటీ డెవలప్మెంట్, డిసీస్ ఇన్ ప్రివెన్షన్ అండ్ ట్రీట్మెంట్, అవుట్ స్టాండింగ్ సర్వీస్ ఇన్ కమ్యూనిటీ సర్వీస్, బ్లడ్ డొనేషన్ క్యాంప్స్, అవుట్ స్టాండింగ్ సర్వీసింగ్ ఎన్విరాన్మెంట్, వెల్ ఆర్గనైజింగ్ గవర్నర్ అఫీషియల్ విసిట్ మరియు డిస్టిక్ కాన్ఫరెన్స్ లకిగాను అవార్డులు లభించేయని తెలియజేశారు.

# కొత్త పాత్రలో చంద్రబాబు.. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇదే తొలిసారి..



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త పాత్రలో కనిపించారు. ఈ మధ్య తరచూ వివిధ రూపాల్లో ప్రజలకు చేరువ అవుతున్న సీఎం గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పేటీఎం)లో టీచర్ పాత్ర పోషించారు. సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైన చంద్రబాబు విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. 'వనరులు' అనే సబ్జెక్ట్ పై సవివరంగా పాఠాన్ని బోధించిన చంద్రబాబు విద్యార్థులతో సమాధానాలు చెప్పించి ఆకట్టుకున్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రబాబు పాఠం చెబుతుండగా, విద్యార్థులతోపాటు ఆయన కుమారుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా బుద్ధిగా పాఠం విన్నారు. ఈ ఫొటో కూడా ఆన్ లైన్ ట్రెండ్ అవుతోంది. చంద్రబాబు 4.%ా% ప్రభుత్వంలో అనేక సరికొత్త కార్యక్రమాలతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి నెలా 'పేదల సేవలో' అనే కార్యక్రమం ద్వారా పింఛన్ల పంపిణీలో భాగమవుతున్న చంద్రబాబు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ అక్కడికక్కడే తగిన ఆదేశాలిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించిన చంద్రబాబు ఓ చర్మకారుడిని తన కారులో ఎక్కించుకుని సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించి అతడి యోగక్షేమాలు, కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఇక ఇప్పుడు మెగా పేటీఎం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమవడానికి సత్యసాయి జిల్లా వెళ్లిన చంద్రబాబు ఎవరి ఊహలకు అందని విధంగా నేరుగా ఓ క్లాసురూంలోకి వెళ్లి టీచర్ అవతారమెత్తారు.

'వనరులు' అనే పాఠ్యాంశాన్ని బోధించిన చంద్రబాబు ఎక్కడ తడబడకుండా, ఎంతో కాలంగా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడి వలే పిల్లలకు అర్థమయ్యేల పాఠాన్ని బోధించారు. వనరులు అంటే ఏంటో ఉదాహరణలతో సహా ఆయన వివరించడంతో విద్యార్థులు కూడా ఆయనతో శ్రుతి కలిసి శ్రద్ధగా పాఠాన్ని విన్నారు. బోధిస్తున్నది ముఖ్యమంత్రి అన్న సంకోచం కూడా పిల్లల్లో ఎక్కడా కనిపించలేదు.వనరులు అంటే ఏంటో రాజు వాళ్ల అమ్మను అడిగాడని పాఠాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. మన అవసరాలు తీర్చే వస్తువులనే వనరులు అంటారని తల్లి సమాధానమిచ్చినట్లు వివరించారు. ఇక మనం తాగే నీరు, ప్రయాణించే బస్సు, చదువుకునే పుస్తకం వంటివాటిని కూడా వనరులు అంటారని చెప్పారు. అదేవిధంగా సౌర విద్యుత్ ను పునరుత్పాదక ఇంధన వనరు అంటామని సోలార్ పవర్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు వారు భవిష్యత్తులో ఏం అవ్వాలని కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఫొటోలు దిగారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు.

# మనోళ్లకు అమెరికా మోజు తగ్గినట్టేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు అమెరికాలో ఉన్నత విద్య భారతీయ విద్యార్థులకు కలల గమ్యస్థానం. అగ్రరాజ్యంలో చదువుకోవడం, అక్కడే స్థిరపడటం ఎంతో మంది యువత ఆకాంక్షగా ఉండేది. అయితే, ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**తగ్గుతున్న ఆసక్తి వెనుక కారణాలు**

F-1 విద్యార్థి వీసాల జారీలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. 2023లో 89,000 వీసాలు మంజూరవగా.. 2024లో ఈ సంఖ్య 59,000కి పరిమితమైంది. ఇది దాదాపు 33 శాతం క్షీణతను సూచిస్తుంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వీసా ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను పరిశీలించడం ఒక ముఖ్యమైన అంశంగా మారింది. ఇది విద్యార్థులలో ఆందోళన కలిగిస్తోందివీసా నిబంధనలు మరింత కఠినతరం కావడంతో, దరఖాస్తులు తిరస్కరించబడే అవకాశాలు పెరుగుతున్నాయి. అమెరికాలోని రాజకీయ అనిశ్చితి, ముఖ్యంగా వలస విధానాలపై తరచుగా మారుతున్న నిర్ణయాలు విద్యార్థులలో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగ అవకాశాలపై స్పష్టత లేకపోవడం, ముఖ్యంగా H-1B వీసాల చుట్టూ ఉన్న సంక్లిష్టతలు భారతీయ విద్యార్థులను నిరుత్సాహపరుస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తే OPT (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ) ప్రోగ్రామ్‌పై ఆంక్షలు విధించవచ్చనే ఊహాగానాలు విద్యార్థులలో ఆందోళన కలిగిస్తున్నాయి. H-1B విధానాల్లో మార్పులు, డిపోర్టేషన్ భయాలు వెంటాడుతున్నాయి. H-1B వీసా విధానాలలో మార్పులు, డిపోర్టేషన్ భయాలు కూడా అమెరికా పట్ల ఆసక్తి తగ్గడానికి దారితీస్తున్నాయి.

**పెరిగిన ఖర్చులు భారంగా మారుతున్నాయి**

గత దశాబ్దంలో అమెరికాలో ఉన్నత విద్య ఖరీదైనదిగా ఉన్నప్పటికీ, చాలా మందికి అది అందుబాటులో ఉండేది. అయితే ఇప్పుడు అది మధ్యతరగతి విద్యార్థులకు భారంగా మారుతోంది. ట్యూషన్ ఫీజులు, వసతి, ఆహారం వంటి జీవన వ్యయాలు గణనీయంగా పెరిగాయి. అధిక ఆరోగ్య బీమా ఖర్చులు కూడా విద్యార్థులకు అదనపు భారాన్ని మోపుతున్నాయి. భారత రూపాయి విలువ పడిపోవడం వల్ల అమెరికాలో చదువుకునే ఖర్చు మరింత పెరిగింది. ఈ అంశాలన్నీ కలిసి, మధ్యతరగతి భారతీయ విద్యార్థులకు అమెరికాలో చదువులు కేవలం కలగానే మిగిలిపోయే పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

**ఇతర దేశాలకు పెరుగుతున్న మొగ్గు**

ఈ నేపథ్యంలో చాలా మంది భారతీయ విద్యార్థులు ఇతర దేశాల వైపు దృష్టి సారిస్తున్నారు. యూరప్ దేశాలు, కెనడా, న్యూజిలాండ్ వంటివి తక్కువ ఖర్చుతో కూడుకున్న, నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. అంతేకాకుండా ఈ దేశాలు మెరుగైన పోస్ట్-స్టడీ వర్క్ ఆప్షన్స్‌ను కూడా అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే కెనడాలో భారతీయ విద్యార్థుల సంఖ్య 15 శాతం పెరుగుదలను నమోదు చేసింది. జర్మనీలో ఈ సంఖ్య 20 శాతం పెరిగింది. యూకే, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాలు పోస్ట్-స్టడీ వర్క్ అనుమతులలో సౌలభ్యం కల్పిస్తున్నాయి.

**భవిష్యత్తు మార్గం**

భారతీయ విద్యార్థులు ఈ మారుతున్న గ్లోబల్ ట్రెండ్‌ను గమనించి, ప్రత్యామ్నాయాల వైపు మళ్లుతున్నారు. అమెరికా ఒక్కటే ఉన్నత విద్యకు ఏకైక మార్గం కాదన్న స్పృహ వారిలో పెరుగుతోంది. వీసా ప్రక్రియలలో స్పష్టత, గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగ అవకాశాలపై హామీ లేని పక్షంలో అమెరికా పట్ల భారతీయ విద్యార్థుల ఆసక్తి మరింత తగ్గే అవకాశం ఉంది. ఏ దేశానికైనా ఉన్నత విద్యలో ప్రవేశించే విదేశీ విద్యార్థులు గొప్ప ఆర్థిక, సాంస్కృతిక పెట్టుబడే. అమెరికా వంటి దేశం తన విద్యార్థుల ఆకర్షణను కొనసాగించాలంటే, వీసా విధానాలపై స్పష్టత, పోస్ట్-స్టడీ వర్క్ ఆప్షన్లలో వెసులుబాటు, ఖర్చుల తగ్గింపుపై దృష్టి పెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

# "చిరంజీవికి సీఎం అయ్యే ఛాన్స్"పై దువ్వాడ రియాక్షన్ వైరల్!

**హైదరాబాద్ పెన్ పవర్:** దువ్వాడ శ్రీనివాస్.. చిరంజీవి రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు తాజాగా నెట్టింట వైరల్ గా మారాయి. ఇటీవల కాలంలో ఎప్పుడూ చిరంజీవితో తనకున్న అనుబంధం గురించి వ్యాఖ్యానించినట్లు కనిపించని దువ్వాడ శ్రీనివాస్... తాజాగా ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రజారాజ్యం పార్టీతో, మెగాస్టార్ తో తనకున్న అనుబంధం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవి వైరల్ గా మారాయి. అవును... గత కొంతకాలంగా దివ్వెల మధురితో కలిసి పలు ఇంటర్వ్యూలు ఇస్తున్న దువ్వాడ శ్రీనివాస్... తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవితో, పీఆర్పీ అధినేత చిరంజీవితో నాడు తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇదే సమయంలో... చిరంజీవికి సీఎం అయ్యే ఛాన్స్ పైనా కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్కలిలో 2009లో ఉప ఎన్నిక జరిగినప్పుడు తన నామినేషన్ కు చిరంజీవి వచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2009 ఎన్నికల్లో తాను స్వల్ప మెజారిటీతో ఓటమి పాలై, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో... చిరంజీవి తనకు డబ్బులు పంపించారని, అలాంటి గొప్ప వ్యక్తిత్వం చాలా అరుదని, అది చిరంజీవి గొప్ప వ్యక్తిత్వం అని దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. ఇదే సమయంలో... ప్రజారాజ్యం పార్టీ విలీన సమయంలో తనకు కబురు పెట్టినప్పుడు.. విలీనం వద్దనే తన అభిప్రాయాన్ని చెప్పారు. ఈ నేపథ్యంలోనే... ప్రజారాజ్యం పార్టీని విలీనం చేయకుండా చిరంజీవి అప్పుడు

రాజకీయాలలో కొనసాగి ఉంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత కచ్చితంగా ముఖ్యమంత్రి అయ్యేవారని దువ్వాడ శ్రీనివాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని ఎంతగానో కొనియాడుతూ దువ్వాడ మాట్లాడారు. ఎంతో గొప్ప వ్యక్తి, మంచి మనసున్న వ్యక్తి సీఎం కాలేకపోయారని అన్నారు.





# బ్రెజిల్ 'చక్రవర్తి' మాటలకు ట్రంప్ స్ట్రోక్ తగిలేసింది!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల 14 దేశాలకు ట్రంప్ టారిఫ్ లేఖలు రాసిన ట్రంప్... ఆయా దేశాలపై 25% నుంచి మొదలై 40% వరకూ టారిఫ్ లు విధిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే 'బ్రిక్స్' అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరించారు. దీనిపై స్పందించిన బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డిసిల్వా స్పందిస్తూ.. ట్రంప్ కు గట్టి కౌంటర్ ఇచ్చారు. దీంతో.. బ్రెజిల్ కు ట్రంప్ తనదైన స్ట్రోక్ ఇచ్చేశారు. అవును... అమెరికా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే 'బ్రిక్స్' అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరికలపై స్పందించిన లూలా డిసిల్వా... ప్రపంచం మునుపటిలా లేదు. అందువల్ల మనకు చక్రవర్తి అవసరం లేదు. మన దేశాలు సార్వభౌమాధికారాన్ని కలిగి ఉన్నాయి. ట్రంప్ సుంకాలను జారీ చేస్తే.. ఇతర దేశాలకు అదే చేసే హక్కు ఉందని అన్నారు. దీంతో.. ట్రంప్ తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు.

ఇందులో భాగంగా... బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో ను ప్రస్తుత అధ్యక్షుడు లూలా డిసిల్వా వేధిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. స్వేచ్ఛా ఎన్నికలపై బ్రెజిల్ దాడులు చేస్తోందని ఆరోపిస్తూ.. దీనికి ప్రతీకారం తీర్చుకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కారణంతో ఆ దేశంపై 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 1 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా లూలాను ఉద్దేశించి రాసిన లేఖలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... బోల్సోనారోపై దేశం అనుసరిస్తున్న విధానాన్ని తప్పు పట్టారు. ఆయనపై జరుగుతున్న విచారణ కూడా ఆపేయాలని అన్నారు. బ్రెజిల్ వాణిజ్య విధానాలపై అమెరికా దర్యాప్తు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరోవైపు.. బోల్సోనారోకు



మద్దతుగా బ్రెజిల్ లోని అమెరికా రాయబార కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా... బోల్సోనారో, ఆయన కుటుంబసభ్యులు వాషింగ్టన్ కు బలమైన భాగస్వాములని పేర్కొంటూ.. వారిపై, ఆయన అనుచరులపై జరుగుతున్న రాజకీయ హింస సిగ్గు చేటని.. ప్రజాస్వామ్య సంప్రదాయాలను అగౌరవపరచడమేనని విమర్శించింది. ఇలా ట్రంప్ రాసిన లేఖ, తమదేశంలోని అమెరికా రాయబార కార్యాలయం రాసిన లేఖలపై బ్రెజిల్ ఘాటుగా స్పందించింది. ఇందులో భాగంగా... ఏకపక్షంగా టారిఫ్ లను పెంచిన చర్యను ఆర్థికచట్టాలకు అనుగుణంగా ఎదుర్కొంటామని లూలా 'ఎక్స్' వేదికగా స్పందించారు. మరోవైపు రాయబార కార్యాలయం రాసిన లేఖను బ్రెజిల్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీంతో... ఈ ప్రకటనపై విచారణకు రావాలని అమెరికా రాయబారిని ఆదేశించింది. ఈ తాజా పరిస్థితులు ఎలాంటి పరిణామలకు దారి తీస్తాయనేది వేచి చూడాలి!

# "శత్రువులు ఎక్కడో ఉండరు... చెల్లెళ్ళ రూపంలో ఇంట్లోనే ఉంటారు"!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్.. రాష్ట్రాలుగా విడిపోయినా మిగిలిన ఏ విషయంలోనూ విడిపోలేదనే చెప్పొచ్చు. ఒకప్పుడు మద్రాస్ తో ఆంధ్రులకు ఎలాంటి సంబంధం ఉండేదో అంతకంటే ఎన్నో రెంట్లు ఎక్కువ అనుబంధం ఇరు రాష్ట్రాల మధ్య ఇప్పుడూ కొనసాగుతోంది! దీంతో.. ఇరు రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న రెండు కుటుంబాలు, అందులోని ఆడపడుచులకు సంబంధించిన ఆసక్తికర చర్చ హాట్ టాపిక్ గా మారింది. అవును... రాజశేఖర్ కుమార్తె షర్మిల, చంద్రశేఖర్ కుమార్తె కవిత లు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్ అనే చెప్పాలి! ఉమ్మడి రాష్ట్ర రాజకీయంలో వైఎస్సార్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే అని అంటారు.. తెలంగాణ రాజకీయాలను కేసీఆర్ లేకుండా ఊహించలేమని కొంతమంది చెబుతారు. అలాంటి ఉద్దండులకు వీరు ముద్దుల కుమార్తెలు! ఇదే సమయంలో.. వీరిద్దరూ నోరు మాట్లాడటం మొదలుపెడితే.. తమ తండ్రుల గురించే మాట్లాడతారు. వీరిద్దరికీ వారిద్దరే హీరోలు. వీరి రాజకీయ భవిష్యత్తుకు వారే అన్నీ! వారి వారి తండ్రుల పేర్లే వీరి బలాలూ, బలగాలు! కట్ చేస్తే... ఇద్దరికీ వారి వారి అన్నలే విలన్లు! ఇన్ని సమపోలికలు ఉన్న వీరికి రాజకీయంగా ఓ అతిపెద్ద వ్యత్యాసం ఉంది! అదేమిటంటే... తండ్రి హీరో, అన్న విలన్, ఇద్దరి భర్తల పేర్లు అనీల్! ఈ పోలికల సంగతి పక్కనపెడితే... తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్ పాత్రతో పాటు కవిత పాత్ర అత్యంత కీలకమనే చెప్పాలి. ఇద్దరూ ఎవరి స్థాయిలో వారు పోరాడారు! తెలంగాణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతూ ప్రజలను జాగృతం చేసిన చరిత్ర కవిత కు ఉంది. అయితే.. టీఆరెస్స (ప్రస్తుత బీఆరెస్స) అభివృద్ధిలో కవిత కంటే కేటీఆర్ పాత్ర కాస్త ఎక్కువని చెబుతుంటారు! ప్రధానంగా రెండోసారి అధికారంలోకి రావడంలో! అయితే.. పదవుల విషయంలో కవితకు తండ్రి కేసీఆర్ అయినా, అన్న కేటీఆర్ అయినా ఉన్నంతలో మంచి గౌరవమే ఇచ్చారని చెబుతారు. ఆమె ఎంపీగా పనిచేశారు. టర్వాత ఓటమి పాలైతే ఎమ్మెల్సీ ఇచ్చారు! ఉన్నంతంలో ఆమెకు రాజకీయ పదవులు, అధికారిక ప్రోటోకాళ్లు దూరం కాకుండానే చూసుకున్నారు కేసీఆర్, కేటీఆర్ అని చెబుతారు! ఇక ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారం అయితే బీఆరెస్స కు, కేసీఆర్, కేటీఆర్ లకు పెద్ద తలనొప్పులే తెచ్చిపెట్టిందని చెబుతారు!

కట్ చేస్తే... వైసీపీ విజయంలో, జగన్ జైల్లో ఉన్నప్పుడు తన తల్లితో కలిసి చెల్లెల్లు షర్మిల సుమారు 16నెలలు పార్టీకి చేసిన సేవ గొప్పదనే చెప్పాలి! నాడు ఆమె ఆ స్థాయిలో ధైర్యం చేసి ముందుకు సాగకపోతే.. పార్టీకి పునాదుల సమయంలోనే ఊహించని స్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యేవని చెబుతారు! అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెకు దక్కింది ఏమిటి? వారి వ్యక్తిగత కుటుంబ అస్తుల సంగతి కాసేపు పక్కనపెడితే.. జగన్ ఆమెకు ఎలాంటి పదవులూ ఇవ్వలేదు! అయితే... పదవులన్నీ ఇంట్లో వాళ్లే తీసుకోకూడదని వైసీపీ వాళ్లు సమర్థించుకున్నా... షర్మిలకు ఎలాంటి పదవి ఇచ్చినా అది ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరానికీ అవకాశం ఇవ్వదు! జగనన్న వదిలిన బాణంపై ఆమెకు ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ ఐడెంటిటీ ఉంది! దీంతో.. ఆమె తెలంగాణలో పార్టీ పెట్టి, దాన్ని కాంగ్రెస్ లో కలిపేసి, ఇప్పుడు అదే పార్టీకి ఏపీ చీఫ్ గా ఉన్నారు! ఆమె రాజకీయ భవిష్యత్తు ఇక హస్తం గుర్తు తోనే అని ఆమె ఫిక్సైనట్లు కనిపిస్తున్నారు. తన తండ్రి వైఎస్సార్ – కాంగ్రెస్ పార్టీ.. వేరు వేరు కాదనేది ఆమె మాటగా వినిపిస్తుంటుంది! కవిత మాత్రం తమ నాయకుడు కేసీఆరే అని చెబుతున్నారు!ఇలా పైకి ఇద్దరి పరిస్థితి ఒకటే అన్నట్లుగా పైకి కనిపిస్తున్నా.. ఇద్దరి గతం పూర్తి వైవిధ్యం, ప్రస్తుతానికి కనిపిస్తున్న రాజకీయ భవిష్యత్తు విభిన్నం అనే చెబుతుంటారు రాజకీయ విశ్లేషకులు.ఆ సంగతి అలా ఉంటే... ఇక వీరిద్దరి అన్నల విషయానికొస్తే... వారి వారి రాజకీయాలకు చెల్లెల్లు కచ్చితంగా నెగిటివ్ ప్రభావం చూపిస్తున్నారనే చెప్పాలి! ప్రత్యర్థులకు అవకాశాలు ఇస్తున్నారనే అంటారు! 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి పాలవ్వడానికి షర్మిల మాత్రమే కారణం కాకపోవచ్చు కానీ... ఆమె కూడా ఒక కారణం అని చెప్పి తీరాలనేది చాలా మంది అభిప్రాయం!

పైగా... ఆమె అధికార కూటమి ప్రభుత్వంపై పోరాటం అని చెబుతున్నాప్పటికీ... ప్రధానంగా జగన్ పైనే ప్రత్యక్ష, పరోక్ష రాజకీయ, వ్యక్తిగత పోరాటం అనేది సుస్పష్టం! ఈ విషయంలో ఆమె ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదని అంటారు.. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లోని సమీకరణలు మారేవరకూ!ఇక కవిత విషయానికొస్తే... వచ్చే ఎన్నికల్లో కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుకు ఆమె ఎలాంటి అడ్డు అనేది ఆసక్తికర విషయం! వచ్చే ఎన్నికల్లో బీఆరెస్స అధికారంలోకి వస్తే కేసీఆర్ మాత్రమే సీఎం అనేది అటు కేటీఆర్, ఇటు హరీష్ రావు చెబుతున్నారు. కాకపోతే టాప్ 2 కేటీఆర్ అని అంటున్నారు. ఇక్కడే కవిత కు సమస్య అనే విశ్లేషణలు వినిపిస్తుంటాయి!ఈ నేపథ్యంలోనే... జగన్, కేటీఆర్ ఎప్పుడైనా ఫోన్లు మాట్లాడుకున్నా.. వ్యక్తిగతంగా కలిసినప్పుడు మాట్లాడినా.. వారిద్దరూ "అ ఆ" సినిమాలోని ... "శత్రువులు ఎక్కడో ఉండరన్నా... చెల్లెళ్ళ రూపంలో ఇంట్లోనే ఉంటారు!" అని చెప్పుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు నెటిజన్లు! ఇది (ప్రస్తుతానికి) వారి విషయంలో అయితే నిజమేనా? లేక, డైలాగ్ రివర్సా..??

# వామ్మో.. ట్రంప్ ను సన్ బాత్ చేస్తున్నప్పుడు చంపేస్తారంట!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు ప్రపంచ వ్యాప్తంగా శత్రువుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతున్నట్లే కనిపిస్తోంది! ప్రపంచ పెద్దన్నగా అందరినీ కలుపుకుపోకుండా ఆధిపత్య ధోరణి అవలంభించడమే దీనికి కారణం అనే కామెంట్లు వినిపిస్తున్నాయి! ఈ క్రమంలో ఇటీవల అమెరికా బంకర్ బ్లస్టర్ బాంబుల దెబ్బ రుచి చూసిన ఇరాన్.. ట్రంప్ కు తమ దెబ్బ రుచి చూపిస్తామంటోంది. అవును... ఇటీవల పశ్చిమాసియాలోకి అమెరికా యుద్ధ విమానాలు ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ - ఇరన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఎంట్రీ ఇచ్చిన అమెరికా... టెహ్రాన్ లోని మూడు అణుకేంద్రాలపై పెద్ద ఎత్తున దాడులు చేసింది. ఆ దేశ సుప్రీం లీడర్ ఖమేనీ ఘోరమైన చావు చావకుండా తాము కాపాడామని ప్రకటించుకుంది, అతడిని చంపడం పెద్ద పనికాదని వెల్లడించింది. ఈ సమయంలో ఇరాన్ స్పందించింది. ట్రంప్ కు ఊహించని స్థాయిలో వార్నింగ్ ఇచ్చింది. ఇందులో భాగంగా.. ట్రంప్ ఫ్లోరిడాలోని తన నివాసం వద్ద సన్ బాత్ చేసే సమయంలో లక్ష్యంగా చేసుకుంటామని ఆ దేశ సీనియర్ అధికారి ఒకరు హెచ్చరించారు. ఇకపై ఆయన ఫ్లోరిడా నివాసం కూడా సురక్షితం కాదని పేర్కొన్నారు. డ్రోన్ వచ్చి ట్రంప్ ను ఢీకొనే అవకాశం ఉందని అన్నారు! వివరాల్లోకి వెళ్తే... ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సలహాదారు జావద్ లారిజాని తాజాగా ట్రంప్ కు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక మీడియాలో ప్రసారమైన ఆయన వ్యాఖ్యల్లో... ట్రంప్ కు ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో రిసార్ట్ కూడా ఇకపై సురక్షితం కాదని పేర్కొన్నారు. ఆయన సన్ బాత్ చేస్తున్న సమయంలో ఒక డ్రోన్ ఆయన్ను ఢీకొట్టవచ్చని హెచ్చరించారు. పైగా.. ఇది తమకు చాలా సులభమైన పని అని లారిజాని వ్యాఖ్యానించారు. 2020లో ఇరానియన్ టాప్ జనరల్ ఖాసిం సులేమానీ హత్యలో




ట్రంప్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఆయన ఈ హెచ్చరికలు చేశారు. అయితే... ఈ బెదిరింపులపై ట్రంప్ స్పందించారు. లారిజాని వ్యాఖ్యలను ముప్పు అనే అనుకుంటున్నట్లు తెలిపారు.. వాస్తవానికి అది నిజమో, కాదో తెలియదు.. బహుశా కావొచ్చు కూడా అని స్పందించారు. ఈ సందర్భంగా 'మీరు చివరిసారిగా ఎప్పుడు సన్ బాత్ కు వెళ్లారు' అనే ప్రశ్నకు నవ్వుతూ స్పందించిన ట్రంప్.. తనకు 7ఏళ్ల వయసులో ఉన్నప్పుడు అని చెబుతూ, అది తనకు అంతగా ఇష్టం ఉండదని సమాధానమిచ్చారు. కాగా... ట్రంప్ కు రివార్డు ఇవ్వాలని బ్లడ్ పాక్ట్ అనే ప్లాట్ ఫామ్ క్రౌడ్ ఫండింగ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ప్లాట్ ఫామ్ ఇరాన్ నాయకత్వానికి శత్రువులుగా భావిస్తున్న వారిపై, ఖమేనీని అమర్యాదగా సంబోధించిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు అవసరమైన నిధులను సేకరిస్తుంది. ఈ క్రమంలో జులై 8 నాటికి ఇది 27 మిలియన్ డాలర్లను సేకరించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి బెదిరింపులు రావడం గమనార్హం.

# రాజంపేట పేట రాజకీయం వేడెక్కించేశారే... !




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి నియోజకవర్గానికీ ఒక హిస్టరీ ఉంటుంది. అలానే.. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేటకు కూడా అలాంటి హిస్టరీనే ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ ఇక్కడ విజయం దక్కించుకుంది. ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి గత ఎన్నికల్లో గెలుపు గుర్రం ఎక్కారు. అయితే.. చిత్రం ఏంటంటే.. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాల సుబ్రహ్మణ్యం ఇప్పుడు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు.. గత ఎన్నికల్లో షఫిలింగ్‌కు గురైన మేడా మల్లికార్జున రెడ్డి కూడా.. వైసీపీలోనే కొనసాగుతున్నారు.అంటే.. ఒకరకంగా రాజంపేటలో వైసీపీకి బలం పెరిగిందనే అనుకోవాలి. టీడీపీ నుంచి జంపింగులు సాగడం.. వైసీపీలోనూ నాయకులు ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో రాజంపేట నియోజకవర్గంలో రాజకీయా లు సహజంగానే వేడి వేడిగా సాగాలి. సర్కారును కార్నర్ చేసేలా నాయకులు స్పందించాలి. కానీ.. అదేం చిత్రమో కానీ.. గత ఏడాది కాలంలో ఎలా ఉన్నా.. గత రెండు మాసాలుగా మాత్రం ఇక్కడి రాజకీయాలు స్తబ్దుగా మారాయి. అంతేకాదు.. సుగవాసి సోదరుడు.. ఇప్పుడు కీలక నాయకుడిగా మారారు.టీడీపీ జిల్లా ఇంచార్జ్‌గా ఉన్న సుగవాసి సోదరుడు ఇప్పుడు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే.. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న బీసీ జనార్దన్‌రెడ్డికి.. ఆయనకు మధ్య పొసగడం లేదన్న కబుర్లు వినిపిస్తున్నాయి. గత నెలలో పెద్ద వివాదమే తలెత్తింది. అయితే.. కీలక నాయకుడిగా ఉన్న సుగవాసి సుబ్రహ్మణ్యం బయటకు వచ్చాక.. మార్పులు జరుగుతాయని అనుకున్నా.. ఇప్పటి వరకు నియోజకవర్గం ఇంచార్జ్‌ని నియమించలేదు. ఈ సీటు కోసం.. సుగవాసి సోదరుడు ప్రయత్నాలు చేస్తున్నారు.కానీ. బీసీ జనార్దన్‌రెడ్డి మాత్రం తన వారితో భర్తీ చేయాలని చూస్తున్నారు. ఈ పరిణామాలు ఇలా ఉంటే.. వైసీపీలో కీలక నాయకులు ఉండడం కూడా కలసి రావడం లేదు. ఎవరూ కూడా దూకుడుగా రాజకీయాలు చేయలేక పోతున్నారు. ఎవరు ప్రజల్లోకి వెళ్తే.. ఏం జరుగుతుందో అనే బెంగతోపాటు.. ఇప్పుడే ప్రజల్లోకి వెళ్లినా ఎన్నికలనాటికి టికెట్ విషయంపై కసరత్తు చేపడితే.. అప్పుడు తమ పేరు ఉంటుందో ఉండదోనన్న ఆవేదన కూడా నాయకుల్లో కనిపిస్తోంది. సో.. ఇలా రాజంపేట రాజకీయాల్లో రెండు ప్రధాన పార్టీలు కూడా అంతర్గత ఇబ్బందులు పడుతున్న విషయం గమనార్హం.

# చంద్రబాబు ప్రయోగం వికటించిందా? కేబినెట్లో అనుభవ రాహిత్యంతోనే సమస్యలా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది కిందట 4.O ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్లో కొత్తవారిని తీసుకున్నారు. పాలనలో యువతకు భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో సీనియర్లను పక్కన పెట్టారు. కొత్తగా అవకాశం దక్కించుకున్న మంత్రులు తనతో పోటీ పడి పనిచేస్తే రాష్ట్రాన్ని గాడిన పెట్టడంతోపాటు భవిష్యత్తులో తన కుమారుడు లోకేశ్ కు బాధ్యతలు బదిలీ చేసే సమయంలో అనుభవమున్న టీమును అప్పగించొచ్చని భావించారు. దీంతో 24 మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో సుమారు 18 మందికి తొలిసారి మంత్రిగా నియమించారు.



అయితే తొలిసారి మంత్రులుగా బాధ్యతలు తీసుకున్న 18 మందిలో 90 శాతం మంది అంచనాలకు తగినట్లు పనిచేయడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. సీనియర్లలో మంత్రి నారాయణతోపాటు ఒకరిద్దరు బాగానే పనిచేస్తున్నప్పటికీ కొత్తగా మంత్రి పదవులు తీసుకున్నవారే ఏడాది అయినా కుదురుకోవడం లేదని, జిల్లా రాజకీయాలపై పట్టు సాధించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తరాంధ్రలో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం ఇచ్చినా, ఆ ఇద్దరు ప్రతిపక్షాన్ని సమర్థంగా అడ్డుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఉత్తరాంధ్రలో మండలిలో ప్రతిపక్ష నేత బొత్స హవా ఇప్పటికీ నడుస్తున్నట్లు వార్తలు రావడంపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని అంటున్నారు.

అదేవిధంగా విశాఖ జిల్లాలో సీనియర్లను కాదని మంత్రి అనితకు బాధ్యతలు అప్పగిస్తే, ఆమె పనితీరు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. ప్రధానంగా సింహాచలం చందనోత్సవం సమయంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యాన్ని సీఎం సీరియస్ గా తీసుకున్నట్లు చెబుతున్నారు. పార్టీపరంగా విశాఖ చాలా కీలకమని అటువంటి చోట మంత్రి అనిత మరింత దూకుడు చూపించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఆమె ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోవడానికి పార్టీ పరంగా కొన్ని అవాంతరాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో అనిత కన్నా సీనియర్లు ఎమ్మెల్యేలుగా ఉండటంతో మంత్రి ఎమ్మెల్యేలను సమన్వయం చేయలేకపోతున్నారని అంటున్నారు.

ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కూడా సీనియర్లను పక్కనపెట్టి తొలిసారి గెలిచిన సుభాష్ కు మంత్రి పదవిని కట్టబెట్టారు. అయితే ఆయన కూడా ఇతర నేతలను సమన్వయం చేయలేకపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాక్ష్యాత్తు సీఎం చంద్రబాబు ఓ సారి మంత్రి పనితీరు సరిగా లేదని మందలించినట్లు ఆడియో వైరల్ అయింది. ఇక అప్పటి నుంచి సుభాష్ ను ఏ క్షణమైనా తప్పిస్తారని ప్రచారం ఊపందుకుంది. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ తరఫున నిమ్మల రామానాయుడు ఒక్కరే మంత్రిగా ఉన్నారు. ఈ జిల్లాలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వంటివారు పార్టీ పరంగా జోరు చూపిస్తున్నారు. అయితే ఏలూరు వంటి నియోజకవర్గాల్లో పార్టీని సమన్వయంతో నడిపించలేకపోతున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు.

ఇక కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో అనుభవజ్ఞులైన కొల్లు రవీంద్ర, పార్థసారథి మంత్రులుగా ఉన్నప్పటికీ ప్రతిపక్షానికి చెందిన పేర్ని నానిని కంట్రోల్ చేయలేకపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదేవిధంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా, ఇద్దరూ కొత్త కావడం వల్ల చిన్నపాటి సమస్యలు ఉన్నా ఆ ఇద్దరిపై సీఎం చంద్రబాబుకు మంచి అభిప్రాయమే ఉందని అంటున్నారు. ఇక రాయలసీమకు వచ్చేసరికి కడప, అనంతపురం జిల్లాల్లో ముగ్గురు మంత్రులు ఉన్నారు. ఇందులో ఒకరు బీజేపీ నేత సత్యకుమార్ కాగా, మిగిలిన టీడీపీకి చెందిన మంత్రులు సవిత, రాంప్రసాద్ రెడ్డి. ఈ ఇద్దరి పనితీరుపైనా సీఎం ఏమంత సంతృప్తిగా లేరని అంటున్నారు.

కొత్తగా అవకాశం దక్కించుకున్న మంత్రుల్లో చాలా మంది బ్యూరోక్రాట్లుగా పనిచేస్తున్నారని, తాము రాజకీయ నాయకులమని పార్టీని బలోపేతం చేయాలన్న ఆలోచన ఉండటం లేదని పార్టీలో అభిప్రాయం వ్యక్తమవుతోంది. డ్యూటీలకు వచ్చినట్లు పార్టీ కార్యాలయంలోనో, తమ క్యాంపు కార్యాలయంలోనో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని చేతులు దులుపుకుంటున్న వారే ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. తమకు అందిన అర్జీలను పరిష్కరించారా? లేదా? అని ఫాలో అప్ చేయడం లేదని, ఫలితంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. అంతా యాంత్రికంగా పనిచేస్తున్నారు కానీ, రాజకీయంగా ఉత్సాహంగా ఉండటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి చెందుతున్నారని అంటున్నారు. రాజకీయ ఎత్తుగడలు వేయకుండా, ప్రత్యర్థులపై పైచేయి సాధించకుండా ఎల్లకాలం పదవుల్లో ఉంటామనుకోవడం కరెక్టు కాదన్న ఆలోచనతో మంత్రి మండలిని పునర్వ్యవస్థీకరించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు. అయితే ఇప్పటికిప్పుడు మార్పులు ఉండకపోయినా, కొద్ది నెలల్లో తన జట్టును సమూలంగా మార్చాలన్న నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీంతో కొత్త మంత్రులుగా మళ్లీ సీనియర్లకు అవకాశాలు ఇచ్చే పరిస్థితి కనిపిస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ సవాల్ ను సింగిల్ గా స్వీకరించిన నారా లోకేష్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి అన్ని విధాలా మద్దతు, సహకారం.. రాష్ట్రం నుంచి కేంద్రానికి అన్ని విధాలా మంచి పేరు, తోడు అన్నట్లుగా కూటమి పార్టీల మధ్య అనుబంధం, అవగాహన సాగుతుందని అంటున్నారు. ఈ సమయంలో మోడీ ఇచ్చిన టాస్క్, పవన్ ఇచ్చిన సవాల్ ను లోకేష్ సింగిల్ గా టేకప్ చేశారు.

అవును... ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి సీఎం చంద్రబాబుతో పాటు విద్యాశాఖ మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... ప్రతి ఒక్కరి విజయం వెనుక ఉండేది, తరగతి గదిలో జీవిత పాఠాలు చెప్పేది గురువులని.. మన ఎదుగుదలను కోరుకునేది గురువులే అని అన్నారు. ఇదే సమయంలో... మనకు నడక, బాధ్యత నేర్పేది అమ్మ అని.. తల్లి పట్ల గౌరవం పెంచడానికే తల్లికి వందనం అని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. ఇదే సమయంలో... పాఠశాలల్లో రాజకీయాలకు ఏమాత్రం తావు లేదని చెప్పిన లోకేష్.. ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జరుగుతోందని అన్నారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు ఆటలు, పాటలు, యోగా నేర్పిస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలోనే పవన్ సవాల్ కు స్పందించారు. ఇందులో భాగంగా... అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పిన లోకేష్... ప్రధాని పిలుపు మేరకు రాష్ట్రంలో కోటి మొక్కలు నాటాలని పవన్ సవాల్ విసిరారని అన్నారు. ఈ సందర్భంగా.. "పవన్ సవాల్ ను నేను స్వీకరిస్తున్నా.. విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతాం" అని లోకేష్ తెలిపారు.దీంతో... ఇలాంటి ఆరోగ్యకరమైన పోటీ వాతావరణంలో కూటమి పార్టీల మధ్య పాలన సాగుతోందనే కామెంట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్నాయి.

# లిక్కర్ స్కాంలో మరో ఐఏఎస్.. విచారణకు రమ్మంటూ సిట్ నోటీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ లిక్కర్ స్కాంలో మరో ఐఏఎస్ పేరు బయటకు వచ్చింది. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ భార్గవకు సిట్ నోటీసులు జారీ చేసింది. కీలక హోదాలో ఉండి మద్యం అమ్మకాలు, కొనుగోళ్లలో అనేక అవకతవకలు జరుగుతుంటే కనీసం అభ్యంతరం చెప్పకపోవడం ఏంటి? అన్న కారణంతో రజత్ భార్గవ పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితమే రిటైర్ అయిన రజత్ భార్గవ పాత్రపై సందేహాలు వ్యక్తం కావడంతో 11వ తేదీ శుక్రవారం సిట్ ముందుకు వచ్చి తమ అనుమానాలను నివృత్తి చేయాలని సిట్ నోటీసులు జారీ చేసింది. లిక్కర్ స్కాంలో రిటైర్డ్ ఐఏఎస్ రజత్ భార్గవ పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆయనను అరెస్టు చేస్తారా? లేక సాక్షిగా పరిగణించి విచారించి వదిలేస్తారా? అనే చర్చ జరుగుతోంది. అయితే స్కాంలో రజత్ భార్గవకు కూడా ముడుపుల మొత్తం అందిందని, అందుకే ఆయన పూర్తిగా సహకరించారని సిట్ అధికారులు భావిస్తున్నారని అంటున్నారు. స్కాంలో రిటైర్డ్ ఐఏఎస్ పాత్ర నిర్ధారించుకున్నాకే ఆయనకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు.

దీంతో ఈ స్కాంలో ఇరుక్కున్నఐఏఎస్ అధికారుల సంఖ్య రెండుకు చేరింది. లిక్కర్ స్కాంలో ఇప్పటికే రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి అరెస్టు అయ్యారు. ప్రస్తుతం ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మద్యం పాలసీ రూపకల్పన నుంచి కమీషన్లు తీసుకోవడం వరకు అడుగడుగునా ఉల్లంఘనలు జరిగినట్లు సిట్ అధికారులు ఆరోపిస్తున్నారు. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఎక్సైజ్ శాఖను శాసిస్తుంటే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత భార్గవ ప్రేక్షక పాత్ర పోషించారని ఆయనపై ఆరోపణలు వినిస్తున్నాయి. ఈ కారణంగానే సిట్ ఆయనను అనుమానిస్తోందని అంటున్నారు. మద్యం దుకాణాలలో కొత్త బ్రాండ్లు అమ్మాలంటే మొదటి నెలలో పది వేల బాక్సులకు మించి ఆర్డర్ ఇవ్వకూడదని నిబంధనలు ఉండగా, ఆదాన్ డిస్టలరీస్ అనే సంస్థకు తొలి నెలలోనే లక్షా 80 వేల కేసులకు ఆర్డర్ ఎలా ఇచ్చారు? దీని వెనుక ఎవరున్నారు? రిటైల్ అవుటలెట్ల నుంచి పెట్టాల్సిన ఆర్డర్లు డిపో మేనేజర్లు పెట్టేలా ఎందుకు నిబంధనలు మార్చారు? వంటి వాటిని రజత్ భార్గవ నుంచి తెలుసుకోవాలని సిట్ అనుకుంటోందని అంటున్నారు.

ఇక రజత్ భార్గవ విచారణతో ఈ కేసులో మరికొందరి పాత్ర బయటకు వచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ కేసులో సుమారు 40 మంది నిందితులను గుర్తించగా, సుమారు 11 మంది వరకు అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల్లో ఒకరిద్దరు న్యాయస్థానం నుంచి రక్షణ పొంది అరెస్టు ముప్పు నుంచి తప్పించుకున్నారు. మిగిలిన నిందితులను ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

# పిక్ ఆఫ్ ది డే... నాడు లోకేష్ మిస్సైంది నేడు దొరికింది!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ వ్యాప్తంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్.. తన లైఫ్ లోని 'పీటీఎం'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవును.. స్కూల్స్ లో జరిగే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కి కొంతమంది నాన్న రావాలని, కొంతమంది అమ్మ రావాలని కోరుకుంటుంటారు! మరికొంతమంది ఇద్దరూ వస్తే బాగుండు అని భావిస్తారు! ఇంకొంతమంది ఎవరూ రాని పరిస్థితిని కలిగి ఉంటారని అంటారు! ఈ సమయంలో తాను స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో తన జీవితంలో జరిగిన పీటీఎం గురించలను లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఇందులో భాగంగా... తాను చదువుకునే రోజుల్లో కూడా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగేదని గుర్తుచేసుకున్న లోకేష్... అయితే ఆ మీటింగ్స్ కు తన తండ్రి చంద్రబాబు ఎప్పుడూ రాలేదని, తల్లి భువనేశ్వరి మాత్రమే హాజరయ్యేవారని తెలిపారు. కానీ మీ పేరెంట్ టీచర్స్ మీట్ కు మాత్రం ఏకంగా సీఎం చంద్రబాబు హాజరయ్యారని లోకేష్ విద్యార్థులకు తెలిపారు. ఇదే సమయంలో... ఇప్పుడు తన కుమారుడు దేవాన్ష్ పేరెంట్ టీచర్స్ మీట్ కు తాను కూడా వెళ్లలేకపోతున్నానని, తన భార్య బ్రాహ్మణి మాత్రమే వెళ్తుందని తెలిపారు. ఈ విధంగా... తన స్కూల్ డేస్ నుంచే తన తండ్రి ప్రజాసేవకు అంకితమైపోయిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ.. నేడు తాను అదే పంథాలో ఉన్న విషయాన్ని తలచుకుంటూ లోకేష్ ఈ వ్యాఖ్యలు చేశారు! ఈ సందర్భంగా నాడు తాను తండ్రితో పాటు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ వద్ద తీసుకోవాల్సిన ఫోటోను.. నేడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న తన తండ్రితో, మంత్రి హోదాలో ఉన్న తాను ఫోటో దిగారు. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై... "నాడు లోకేష్ మిస్సైంది నేడు దొరికింది" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## ఎర్రసముద్రంలో అన్నంతపని చేసిన హూతీలు... తెరపైకి హాలీవుడ్ సినిమా సీన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరిగిన సమయంలో స్పందించిన యెమన్ కు చెందిన హూతీ తిరుగుబాటుదారుల నుంచి హెచ్చరికలు జారీ అయిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. ఇరాన్ పై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ తో అమెరికా జట్టుకడితే.. ఎర్ర సముద్రంలోని నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని అన్నారు! ఈ మేరకు ఆ సంస్థ మిలిటరీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సారీ ఓ వీడియో విడుదల చేశారు. ఈ క్రమంలో తాజాగా అమెరికా, ఇజ్రాయెల్ లకు హెచ్చరికలు చేస్తూ ఎర్రసముద్రంలో భీకర దృశ్యాన్ని సృష్టించారు! ఇందులో భాగంగా... ఎర్రసముద్రంలో ఓ భారీ ఓడను హూతీ మిలిటెంట్లు సముద్ర గర్భంలో కలిపేశారు. అవును... ఎర్రసముద్రాన్ని వేదికగా చేసుకుని ప్రపంచ దేశాలను బెదిరిస్తున్న హూతీ మిలిటెంట్లు.. తుర్కియేకు పెద్ద మొత్తంలో సరకులతో వెళుతున్న ఓడను ముంచేశారు. వీటికి సంబంధించిన దృశ్యాలు హాలీవుడ్ సినిమా సన్నివేశాలను గుర్తుకుతెస్తున్నట్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో.. అమెరికా, ఇజ్రాయెల్ కు హెచ్చరికలు చేశారు. తాజాగా హూతీకి చెందిన మీడియా దీనికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది. పెద్ద మొత్తంలో ఎరువులు, స్టీల్ తో ఆ మేజిక్ సిస్ ఓడ తుర్కియేకు బయలుదేరింది. ఈ సమయంలో ఎర్రసముద్రంలో మాటువేసిన మిలిటెంట్లు.. ఆ నౌకను అటాక్ చేసి, అందులోకి ఎక్కారు. అందులో ఉన్న సిబ్బందితో పాటు వారు చిన్న బోట్లలోకి ఎక్కి, కాస్త దూరం వెళ్లిన తర్వాత ఆ ఓడను పేల్చేశారు. దీనికోసం గ్రానైట్లను ఉపయోగించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ భారీ ఓడ మెల్లమెల్లగా సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటన అంతటినీ డ్రోన్ వీడియోలతో చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై అంతర్జాతీయంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## ఏం సాధించినట్టు.. జగన్ పర్యటనపై జనం టాక్...!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్.. తాజాగా చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో పర్యటించారు. యధావిధిగా పోలీసుల ఆంక్షలు పక్కదారి పట్టాయి. భారీ ఎత్తున తరలి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన రైతుల ను పరామర్శించారు. వారి సమస్యలు విన్నారు. అయితే.. వారికి ప్రత్యక్షంగా ఏమీ చేయలేనని చెప్పారు. అంతేకాదు.. ప్రభుత్వంపై తాను ఒత్తిడి తీసుకువస్తేనే.. ఈ మాత్రం అయినా.. జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై రైతుల్లోనూ అసహనం ఏర్పడింది. గతంలో వైసీపీ హయాంలో కూడా ఇదే సమస్య వెంటాడిందని.. అప్పుడు జగన్ ఏమీ చేయలేకపోయారని మెజారిటీ రైతులు వ్యాఖ్యానించారు. నిజానికి అప్పట్లోనూ మామిడితోపాటు.. చిత్తూరు జిల్లాలో టమోటా రైతులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై టమోటాలను పారబోసి నిరసన తెలిపారు. అయినప్పటికీ.. జగన్ బయటకు రాలేదు. ఇక, మామిడి రైతులు.. కరోనా సహా.. తర్వాత రెండేళ్ల పాటు పంటల జోలికి కూడా పోలేదు. అప్పట్లో ఈ రైతులను గాలికి వదిలేశారన్న వాదన వినిపించింది. కానీ.. జగన్ మాత్రం మౌనంగానే ఉండిపోయారు. ఇక, ఇప్పుడు తగుదునమ్మ అంటూ.. రైతులను పరామర్శించేందుకు వెళ్లినా.. ఇది రాజకీయ పర్యటననే తలపించిందన్న వాదన బలంగా వినిపించింది. అధికార పార్టీ విమర్శలు గుప్పించినట్టుగానే.. వైసీపీ నాయకులు.. హద్దులు మీరడం, దీనిని రైతు యాత్రగా కంటే కూడా.. రాజకీయ యాత్రగా మార్చడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. అంతేకాదు.. రైతులకు ఏమీ చేయలేనని చెప్పేందుకు జగన్ అక్కడకు వెళ్లడంఎందుకన్న వాదనా వినిపించింది. ప్రభుత్వాన్ని తిట్టేందుకు ఈ పర్యటన పెట్టుకున్నారన్న విమర్శలు కూడా వినిపించాయి. ఇక, సర్కారు ఏమన్నా.. జగన్ పర్యటనలతో ఉలిక్కిపడిందా..? అంటే.. అదేమీ లేదు. ముందుగానే కేంద్రంతో చర్చిం చి.. మామిడి రైతులను ఆదుకునేలా నిధులు ఇవ్వాలని కోరింది. మంత్రి అచ్చెన్నాయుడు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించి.. వచ్చారు. రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతోనే ఈ పర్యటన పెట్టుకున్నారు. కానీ, జగన్ తన పర్యటనతోనే ప్రభుత్వం దిగి వచ్చిందని చెప్పడంపై నెటిజన్లు సైతం ఎద్దేవా చేస్తున్నారు.

# అమెరికాలో ఇంత అన్యాయమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్న ఒక అంతర్జాతీయ విద్యార్థికి ఎదురైన దురదృష్టకర సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అన్ని నిబంధనలు పాటిస్తూ %ఇూ% (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ) అనుమతి పొంది, అధికారిక ఈఏడీ (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ ) చేతిలో ఉన్నప్పటికీ అతని విశ్వవిద్యాలయం అనవసర నిబంధనలు విధించి ఉద్యోగంలో చేరకుండా అడ్డుకుంది. ఈ విషయాన్ని సదరు విద్యార్థి సోషల్ మీడియాలో పంచుకోగా, విద్యార్థి సంఘాలు, నెటిజన్లు తీవ్రంగా స్పందించారు.

**ఒక కాగితం కోల్పోయినందుకేనా ఈ ఆంక్షలు?**

విద్యార్థి చెప్పిన వివరాల ప్రకారం.. USCIS ఆన్‌లైన్‌లో ఉన్న ఉద్యోగ అనుమతి స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అతని విశ్వవిద్యాలయం మాత్రం USCIS పంపే "పేపర్ అప్రూవల్ నోటీసు" తప్ప మరేదీ అంగీకరించదట. దురదృష్టవశాత్తు, ఆ పత్రాన్ని విద్యార్థి పోగొట్టుకున్నాడు. ఇప్పుడు కొత్తగా పొందాలంటే Form I-824 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దీనికి అదనంగా $469 ఖర్చవుతుంది. ఇది చాలా మంది ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు భారమే.

**USCIS స్పష్టత, యూనివర్సిటీ నిర్లక్ష్యం!**

వాస్తవానికి, USCIS అధికారికంగా పేర్కొన్న దాని ప్రకారం.. డిజిటల్ అప్రూవల్ పత్రం పూర్తిగా చట్టబద్ధమైనదే. అయినప్పటికీ విశ్వవిద్యాలయం తమ పాత పద్ధతులను మార్చడానికి నిరాకరిస్తోంది. ఇదే పరిస్థితిలో ఉన్న ఇతర విద్యార్థులకు కూడా SEVIS (స్టూడెంట్ మరియు ఎక్స్ చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం) అప్‌డేట్ కావడం లేదు, దీంతో వారికి ఉద్యోగ అవకాశాలు పూర్తిగా దూరం అవుతున్నాయి.

**ఉద్యోగం అంచున, సహాయం సున్నా!**

సదరు విద్యార్థికి ఉద్యోగం మరుసటి రోజే ప్రారంభం కావాల్సి ఉండగా, విశ్వవిద్యాలయం నుంచి ఎటువంటి సహాయం లభించలేదు. %ూజుఎ×ూ% లో ఎంట్రీ లేకపోవడం వల్ల ఉద్యోగంలో చేరే అవకాశం లేకుండా పోయింది. %ఇూ% ద్వారా పని చేయాలనుకునే అంతర్జాతీయ విద్యార్థులకు ఎదురయ్యే అతి పెద్ద సమస్యలలో ఇది ఒకటి. ఉద్యోగాలు పొందడమే కష్టంగా మారిన ఈ తరుణంలో విశ్వవిద్యాలయాలు ఇలాంటి అదనపు నిబంధనలు విధించడం విద్యార్థులకు మరింత కష్టంగా మారింది.

**నెటిజన్ల ఆగ్రహం: మానవత్వంతో కూడిన వ్యవస్థ అవసరం!**

ఈ ఘటనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. "అధికారికంగా అనుమతులు ఉన్నా, కాలేజీలు తాము తయారుచేసుకున్న నిబంధనల వల్ల విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి" అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక విద్యార్థి చట్టబద్ధంగా అనుమతిని పొందినప్పటికీ, విద్యాసంస్థలు వారి స్వంత నిబంధనలను తలకెత్తుకుని ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయడం తీవ్రంగా విమర్శించదగిన విషయం. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఇలాంటి వ్యవహారాలు మానవత్వంతో కూడినవి కావాలి. అంతర్జాతీయ విద్యార్థులకు మార్గదర్శక వ్యవస్థ అత్యవసరం. ఇలాంటి అన్యాయాలు మళ్లీ జరగకుండా నిరోధించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఎమర్జెన్సీ ఓ చీకటి చాప్టర్ కాదు.. అంతకుమించి.. థరూర్ సంచలన వ్యాసం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత చరిత్రలో 1975 జూన్ 25న ఓ సంచలన పరిణామం.. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ఓ మాయని మచ్చ. పరిస్థితులు, పరిణామాలు ఎలా ఉన్నా.. ఇందిరాగాంధీ వంటి బలమైన నాయకురాలు అలాంటి నిర్ణయం తీసుకుంటారని ఎవరూ ఊహించలేదు. ఆ తర్వాత జరిగినదంతా చరిత్రే. ఇదంతా జరిగి 50 ఏళ్లయింది. అందరూ మర్చిపోతున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి అయిన శశిథరూర్ మాత్రం వివాదాస్పదం చేశారు. ఎమర్జెన్సీని ప్రధాని మోదీతో పాటు బీజేపీ నాయకులు తరచూ కాంగ్రెస్ పై తమ విమర్శలకు ఆయుధంగా ఎంచుకుంటారు. నాడు ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ప్రజల హక్కులను కాలరాశారని ఆరోపిస్తుంటారు. దీన్ని బలపరిచేలా థరూర్ తాజాగా ఓ మలయాళ మీడియాకు రాసిన వ్యాసం దుమారం రేపుతోంది. దేశ చరిత్రలో ఎమర్జెన్సీని చీకటి అధ్యాయంగానే చూడలేమని.. థరూర్ తన వ్యాసంలో రాసుకొచ్చారు. దాన్నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నట్లు పేర్కొన్నారు. "ఇందిరా కుమారుడు సంజయ్ గాంధీ నాడు బలవంతంగా కుటుంబ నియంత్రణ సర్జరీలు చేయించారు. వాటిని ఎవరూ మర్చిపోలేరు. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21వ తేదీ వరకు ఎమర్జెన్సీ పేరిట దేశంలో డిసిప్లిన్ కోసం చేపట్టిన చర్యలు నోటితో చెప్పలేని క్రూరత్వానికి దారితీశాయి. శిబిరాలు పెట్టి మరీ ఊళ్లలో సంజయ్ గాంధీ బలవంతకు శస్త్రచికిత్సలు చేయించారు. ఏకపక్ష లక్ష్యాలను చేరేందుకు హింసను ఆయుధంగా చేసుకున్నారు. ఓ అదుపు లేని శక్తి (సంజయ్ గాంధీ) నిరంకుశత్వానికి దారితీసింది" అని థరూర్ విమర్శల వర్షం కురిపించారు. పేదలు నివాసం ఉండే ఢిల్లీలోని మురికివాడలను నిర్దాక్షిణ్యంగా తొలగించారని.. ఎంత తప్పు అని ఒప్పుకొన్నా.. ఆ రోజులను ఎవరూ మర్చిపోలేరు అంటూ కూడా తప్పుబట్టారు.

**మోదీకి పరోక్ష ప్రశంసలు...**

ఎమర్జెన్సీని పూర్తిగా తప్పుబట్టిన థరూర్.. ఇప్పుడు భారత దేశం స్వావలంబనతో ముందుకెళ్తోందని పరోక్షంగా మోదీ పాలనను పొగిడారు. బలమైన ప్రజాస్వామ్యంలో ఉన్నామని కొనియాడారు. ఎమర్జెన్సీలో పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదని.. ప్రజల ప్రాథమిక హక్కులను అణగదొక్కారని.. భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకున్నారని, ఇదంతా దేశ రాజకీయ చరిత్రలో మాయని మచ్చ అని థరూర్ తీవ్రస్థాయిలో రాసుకొచ్చారు. ఆ గతం నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలపర్చుకోవాలని కోరారు.

అంతర్గత గందరగోళం, బయటి శక్తుల ముప్పును తప్పించుకోవడానికి

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నిర్ణయం తీసున్నా.. అది ప్రజల్లో తీవ్ర భయాందోళనలకు దారి తీసిందని తప్పుబట్టారు. న్యాయ వ్యవస్థ కూడా ఒత్తిడికి లోనై హెబియస్ కార్పస్ హక్కులనూ నిలిపివేసిందని పేర్కొన్నారు. అపరిమిత అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేయొచ్చో ఈ చర్యలు నిరూపించాయని థరూర్ రాసుకొచ్చారు.

# ఎఫ్-1 వీసా ఖాళీలు, సోషల్ మీడియా స్క్రీనింగ్: అమెరికా చదువులు నరకం



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే అంతర్జాతీయ విద్యార్థుల కలలు ఇప్పుడు కల్లోలంలో పడ్డాయి. ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు ఈ ప్రక్రియ మరింత క్లిష్టంగా మారింది. వీసా ఇంటర్వ్యూల తర్వాత  అనే ఫారమ్ చేతిలో పడటంతో చాలామంది అయోమయంలో పడుతున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా స్క్రీనింగ్ అనే కొత్త నిబంధన వారి ఎదుట పెద్ద సవాలుగా మారింది. అమెరికా వీసా దరఖాస్తులో తమ సోషల్ మీడియా లింకులను ఎలా ఇవ్వాలో స్పష్టత లేకపోవడం గందరగోళాన్ని మరింత పెంచుతోంది. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (USCIS) , స్టేట్ డిపార్ట్‌మెంట్ (DOS) ఈ వీసా ప్రక్రియను మరింత కఠినతరం చేశాయి. ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులకు అధికారులు మౌఖికంగా హెచ్చరికలు జారీ చేసి, వారి సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌గా ఉంచాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా ఒక ఫారాన్ని ఇచ్చి అందులో "మీ సోషల్ మీడియా లింకులు ఇవ్వకపోతే ప్రాసెసింగ్ మొదలవదు" అని స్పష్టంగా పేర్కొన్నారు.

**221(g) అంటే ఏమిటి?**

వీసా ఇంటర్వ్యూలో "221(g)" స్టేటస్ వచ్చినప్పుడు దానిని చాలామంది తిరస్కరణగా అపార్థం చేసుకుంటున్నారు. కానీ ఇది పూర్తిగా తిరస్కరణ కాదు. దీని అర్థం మీ దరఖాస్తు "అడ్మినిస్ట్రేటివ్ ప్రాసెసింగ్"లో ఉంది. అంటే అధికారులు మీరు ఏదైనా రిస్క్ కలిగిన వ్యక్తి అని అనుమానించినా మీ సోషల్ మీడియా పోస్ట్‌లు, మీరు షేర్ చేసిన మీమ్స్, ట్వీట్‌లు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

**భారతీయులకు డబుల్ షాక్**

ఇది ఒక్క సమస్య మాత్రమే కాదు. భారతీయ విద్యార్థులు మరో తీవ్రమైన సమస్యను కూడా ఎదుర్కొంటున్నారు. వీసా అపాయింట్‌మెంట్లు దొరకడం లేదు. ఇప్పటికే వీసా తిరస్కరణల సంఖ్య పెరుగుతోంది. చాలా మంది విద్యార్థులు 214(b) కింద వీసా తిరస్కరణను ఎదుర్కొంటున్నారు. దీని అర్థం వారు తమ స్వదేశంతో బలమైన సంబంధాలను నిరూపించలేకపోయారు అని అమెరికా అధికారులు భావించడం. ఈ నిబంధన కింద వీసా తిరస్కరించినప్పుడు, అధికారులు కారణం చెప్పాల్సిన అవసరం లేదు.

**సోషల్ మీడియా స్నేర్ మారిందా?**

చాలా మంది విద్యార్థులు తమ పాత సోషల్ మీడియా పోస్టులు, ముఖ్యంగా ట్రంప్‌పై చేసిన విమర్శలను తొలగించడం ద్వారా మేలు జరుగుతుందేమో అని భావిస్తున్నారు. కానీ వాస్తవానికి అది మరింత ప్రమాదకరం. %ఙూ% అధికారులకు పాత డేటాను ట్రాక్ చేయడం కష్టమైన విషయం కాదు. ఈ విధంగా పోస్టులు డిలీట్ చేయడం వలన మరింత అనుమానం కలిగించవచ్చు.

**ఇది హింస కాకపోతే మరేమిటి?**

ఇది సాధారణ వీసా తిరస్కరణ కాదు. ఇది ఒక రకంగా హెచ్చరికనే.. అమెరికాలోకి అడుగు పెట్టే ముందు మీరు అన్ని నియమాలను అంగీకరించాలి అనే హెచ్చరిక. ఈ వీసా విధానాల్లో మార్పులు, సోషల్ మీడియా స్క్రీనింగ్ పద్ధతులు, అపాయింట్‌మెంట్ల జాప్యాలు అన్నీ కలిసి ఎఫ్-1 వీసా దరఖాస్తుదారులకు ఒక భయానక అనుభూతిని కలిగిస్తున్నాయి. చదువుకోవాలనే కలలు కల్లోలంగా మారుతున్నాయి. వీసా దరఖాస్తుదారులకు ఇది ఒక అసలైన పరీక్ష.

# ఇంగ్లాండ్ బ్యాటర్ల తడబాటు.. టీమిండియాదే తొలి సెషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న లార్డ్స్ టెస్టులో టీమిండియా తొలి రోజు తొలి సెషన్ లో ఆధిపత్యం చూపించింది. ఇంగ్లాండ్ పరుగులు రాబట్టడంలో తడబడి రెండు వికెట్లను కోల్పోయింది. మరోవైపు భారత బౌలర్లు తొలి సెషన్ లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. స్పెషలిస్ట్ సీమర్లకు వికెట్లు పడకపోయినా.. ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసుకోవడంతో తొలి సెషన్ లో ఇంగ్లాండ్ 2 వికెట్లు నష్టానికి 83 పరుగులు చేసింది. క్రీజ్ లో రూట్ (24), పోప్ (12) ఉన్నారు. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డికి రెండు వికెట్లు దక్కాయి.

**ఇంగ్లాండ్ ఆచితూచి.. నితీష్ అదరహో:**

పిచ్ స్వింగ్ కు అనుకూలించడంతో తొలి గంటలో ఇంగ్లాండ్ ఓపెనర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. బుమ్రా, ఆకాష్ దీప్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఇంగ్లాండ్ ఆచితూచి బ్యాటింగ్ చేసింది. దీంతో 13 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 39 పరుగులు చేసింది. ఈ దశలో టీమిండియాకు నితీష్ బ్రేక్ ఇచ్చాడు. 13 ఓవర్ మూడో బంతికి బెన్ డకెట్ (23) ను ఔట్ చేసి భారత జట్టుకు తొలి వికెట్ అందించాడు. నితీష్ వేసిన వైడ్ డెలివరీకి డకెట్ మోసపోయాడు. లెగ్ స్టంప్ కు దూరంగా వెళ్తున్న బంతిని ఆడబోయి వికెట్ కీపర్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇదే ఓవర్ చివరి బంతికి మరో ఓపెనర్ క్రాలీ (19) ని సూపర్ డెలివరీతో ఔట్ చేశాడు. బంతి పిచ్ ఇన్ లైన్ మీద పడి అనూహ్యంగా స్వింగ్ ఇన్ స్వింగ్ అయింది. క్రాలీ బంతిని అంచనా వేసేలోపే బ్యాట్ ఎడ్జ్ కు బాల్ తగిలి వికెట్ కీపర్ పంత్ కు క్యాచ్ వెళ్ళింది. దీంతో ఇంగ్లాండ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయి తొలి సెషన్ లో కాస్త వెనకపడింది. ఈ దశలో ఇంగ్లాండ్ ను రూట్ పోప్ ఆదుకున్నారు. మూడో వికెట్ కు అజేయంగా 40 పరుగులు జోడించి లంచ్ సమయానికి మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. రూట్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసినా.. పోప్ పూర్తిగా డిఫెన్సివ్ కే పరిమితమయ్యాడు.

# సాహసమనే చెప్పాలి: టెన్నిస్ ఫేమస్ షాట్ క్రికెట్‌లో పరిచయం చేస్తా: సూర్య కుమార్ యాదవ్




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో ఇన్నోవేటివ్ షాట్స్ ఆడాలంటే సూర్య కుమార్ తర్వాతే ఎవరైనా అని చెప్పాలి. ఏబీ డివిలియర్స్ తర్వాత మిస్టర్ 360 ప్లేయర్ గా సూర్య క్రికెట్ లో పేరు సంపాదించాడు. క్రీజులో స్వేచ్ఛగా కదులుతూ.. శరీరాన్ని ఎటు కావాలంటే అటు తిప్పుతూ స్విచ్ షాట్లు, రివర్స్ స్వీప్‌లు, అప్పర్ కట్‌లతో బౌండరీలు కొట్టి ప్రేక్షకులను థ్రిల్ కు గురి చేస్తాడు. ముఖ్యంగా స్లాగ్ స్వీప్స్ ఆడడంలో సూర్య తనకు తానే సాటి. బుధవారం (జూలై 9) ఇంగ్లాండ్ లో సూర్య కుమార్ యాదవ్ అతని భార్యతో వింబుల్డన్ మ్యాచ్ కు హాజరయ్యాడు. ఈ కార్యక్రమంలో ఒక షాట్ క్రికెట్ లో ఆడాలని ఉందని తన మనసులో మాట బయట పెట్టాడు.

34 ఏళ్ల ఈ టీమిండియా టీ20 కెప్టెన్ టెన్నిస్ పరిభాషలో 'ట్వీనర్' అని పిలువబడే షాట్ ఆడాలనుకుంటున్నట్లు తెలిపాడు. ఆటగాడు వెనుకకు పరిగెత్తి కాళ్ళ మధ్య నుండి బంతిని కొట్టినప్పుడు దీనిని 'ట్వీనర్' అని పిలుస్తారు. టెన్నిస్ లో ఎంతో ప్రాక్టీస్ ఉంటేనే ఈ షాట్ ఆడగలరు. కానీ క్రికెట్ లో ఈ షాట్ ఆడాలంటే సాహసమనే చెప్పాలి. ఆగస్టు నెలలో బంగ్లాదేశ్ పై టీమిండియా సిరీస్ రద్దు కావడంతో సూర్య అక్టోబర్ నెలలో ఆస్ట్రేలియాతో జరగబోయే టీ20 సిరీస్ లో కనబడనున్నాడు. ఒకవేళ ఆగస్టు లో శ్రీలంకతో టీ20 సిరీస్ ఉంటే ఈ టీమిండియా టీ20 కెప్టెన్ ఈ సిరీస్ లో కనిపించనున్నాడు. సూర్య కుమార్ కు ఇటీవలే గురువారం (జూన్ 26) జర్మనీలోని మ్యూనిచ్‌లో సూర్య స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. 'కుడి వైపు పొత్తి కడుపులో ఉన్న హెర్నియాకు డాక్టర్లు విజయవంతంగా సర్జరీ చేశారు. మూడేళ్లలో సూర్యకుమార్‌కు ఇది మూడో సర్జరీ. 2023లో చీలమండకు ఆపరేషన్ చేయించుకున్న అతను 2024లోనూ స్పోర్ట్స్ హెర్నియాకు చికిత్స తీసుకున్నాడు. సర్జరీ చేయడంతో ఈ టీమిండియా టీ20 కెప్టెన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

# ఇంగ్లాండ్‌లో సూర్యవంశీ క్రేజ్.. 14 ఏళ్ళ కుర్రాడి కోసం ఇద్దరు అమ్మాయిలు ఆరు గంటల డ్రైవింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో తన బ్యాటింగ్ తో ప్రపంచాన్ని విస్తుపోయేలా చేసిన 14 ఏళ్ళ కుర్రాడు వైభవ్ సూర్యవంశీ క్రేజ్ రోజు రోజుకీ పెరిగి పోతుంది. ఐపీఎల్ 2025 లో గుజరాత్ టైటాన్స్ పై 35 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకొని ఐపీఎల్ లో సంచలనంగా మారాడు. వైభవ్ ఫామ్ ఐపీఎల్ కు మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవలే ఇంగ్లాండ్ తో ముగిసిన అండర్-19 టోర్నీలో ఒక భారీ సెంచరీతో సహా ఐదు మ్యాచ్ ల్లో 355 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఫార్మాట్ ఏదైనా వైభవ్ దూకుడు ముందు బౌలర్లు కుదేలైపోతున్నారు. ఈ బీహార్ కుర్రాడికి ఇండియాలోనే కాదు ఇంగ్లాండ్ లోనూ ఫ్యాన్స్ ను సంపాదించుకున్నాడు. ఆన్య, రివా అనే ఇద్దరు అమ్మాయిలు వైభవ్ ను కలవడానికి తెగ ఆసక్తి చూపించారు. వీరిద్దరూ ఈ 14 ఏళ్ళ కుర్రాడిని కలవడానికి వూస్టర్‌కు ఆరు గంటల రోడ్ ట్రిప్ పూర్తి చేశారు. రాజస్థాన్ రాయల్స్ పింక్ జెర్సీలు ధరించి ఈ ఇద్దరు అమ్మాయిలు వైభవ్ సూర్యవంశీతో ఫోటోలు దిగారు. ఈ ఫోటోలను రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇటీవలే ముగిసిన అండర్-19 యూత్ వన్డే సిరీస్‌లో సూర్యవంశీ అద్భుతమైన బ్యాటింగ్ తో భారత్ 3-2 తేడాతో సిరీస్ గెలుచుకుంది. ప్రస్తుతం జూలై 12న బెకెన్‌హామ్‌లోని కెంట్ కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యే యూత్ టెస్ట్ సిరీస్‌కు సూర్యవంశీ ఇప్పుడు సిద్ధమవుతున్నాడు. ఐపీఎల్ 2025 లో వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ళ వయసులోనే ఈ మెగా టోర్నీలో ఆడిన అతి పిన్న వయస్కుడిగా నిలిచి సంచలనంగా మారాడు. లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్ లో అరంగేట్రం చేసిన వైభవ్ ఐపీఎల్ లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్ కొట్టి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు. సన్ రైజర్స్ తో జరిగిన రెండో మ్యాచ్ లో భువనేశ్వర్ బౌలింగ్ లో రెండు సిక్సర్లు కొట్టి ఫ్యూచర్ స్టార్ అంటూ కితాబులందుకున్నాడు. ఇలాగే వైభవ్ ఫామ్ కొనసాగితే మరో రెండేళ్లలో టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చిన ఆశ్చర్యం లేదు.



యాషికా ఆనంద్ యొక్క తాజా ఫోటోషూట్ అభిమానులు తమ అభిమాన క్లిక్‌ని ఎంచుకుంటున్నారు



# ప్రగ్య నెవ్వర్ బిఫోర్ బికినీ ట్రీట్

- కంచె - బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్‌ని షేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ టు బాలీవుడ్ బోల్డెస్ట్ అందగత్తెల్లో ప్రగ్య పేరు ముందు వరుసలో ఉంది. ఈ భామ నిరంతర బికినీ షోలు ఎల్లపుడూ ఇంటర్నెట్ లో డిబేట్ కి తెర తీస్తూనే ఉన్నాయి. తనదైన అందం, ఆకర్షణతో చెలరేగే ఈ బ్యూటీ ఈసారి కూడా తగ్గేదే లే!! అంటూ చెలరేగిపోయింది. తాజాగా ప్రగ్య వైట్ అండ్ వైట్ బికినీలో ఒంపు సొంపుల్ని ప్రదర్శించిన తీరుకు కుర్రకారు మతి చెడింది. టోన్డ్ బాడీ, టోన్డ్ లెగ్స్, అందమైన ఎక్స్ ప్రెషన్స్ తో ప్రగ్య గుండెల్లో గుబులు పెంచింది. అందమైన వైట్ మోనోకినీ ధరించి, దానిపైన కవరింగ్ కోట్ తో ప్రగ్య రసగుళికను తలపించింది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.

కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ప్రగ్య ప్రస్తుతం వరస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. టాలీవుడ్ లో అఖండ 2, టైసన్ నాయుడు లాంటి క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. ఈ రెండూ తనకు కెరీర్ పరంగా ప్లస్ అవుతాయని నమ్ముతోంది. ప్రస్తుతం ముంబై టు హైదరాబాద్ ప్రయాణిస్తున్న ప్రగ్య మునుముందు తెలుగు-హిందీలో వెబ్ సిరీస్ లలోను నటించేందుకు సిద్ధమవుతోందని సమాచారం.



అనసూయ భరద్వాజ్ ప్రకాశవంత మైన రంగులలో మెరుస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com